



# మన దునియా

Our News Our World

మన అక్షరం - మన ప్రపంచం

RNI Number TELTEL/2023/85680



రిపోర్టర్లు కావలెను

మన దునియా

తెలుగులో రాయగల సమర్థత, సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు.

తెలుగు రాష్ట్రాలలో సంచనాలు సృష్టిస్తున్న

మన దునియా

మీకు సరైన వేదిక.. అన్ని జిల్లాల, మండలాల మరియు నియోజకవర్గాల పరిధిలో పనిచేసేందుకు అవకాశం కల్పింస్తోంది. రిపోర్టర్లు కావాలి.

ఇంకెందుకు ఆలస్యం...

9490056011,9603969335 నంబర్లకు వాట్సాప్‌లో మీ బయోడేటాను పంపండి.



సంపుటి : 3 | సంచిక : 219 | ఫిబ్రవరి 22 ఆదివారం 2026 | పేజీలు : 8 | వెల రూ. 4.00/-


# “సాగును కాటేస్తున్న ‘నకిలీ’ విషం:

## అన్నదాత భయమే పెట్టుబడిగా రసాయన మాఫియా పంజా!“



**“సాగును కాటేస్తున్న ‘నకిలీ’ విషం: అన్నదాత భయమే పెట్టుబడిగా రసాయన మాఫియా పంజా!“**

**కొత్తగా రాబోతున్న ‘పురుగుమందుల నిర్వహణ బిల్లు2025‘ ఈ నకిలీ దందాకు చరమగీతం పాడుతుందా?**



**మన దునియా,హైదరాబాద్: ఫిబ్రవరి 21**

ప్రకృతి వైపరీత్యాలు ఒకవైపు, మార్కెట్ మాయాజాలం మరోవైపు నకిలీ విత్తనాలు ఇంకో రైతును ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. వీటికి తోడు, నకిలీ పురుగుమందుల విషం సాగును లోపల నుంచే మెల్లగా చంపేస్తోంది.పంటను కాపాడాలన్న రైతు ఆందోళననే పెట్టుబడిగా మార్చుకుని, రసాయన మాఫియా లక్షల కోట్ల వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించింది. ఈ ప్రమాదకర దందాకు అడ్డుకట్ట వేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. కాలం చెల్లిన పాత చట్టాల స్థానంలో, పురుగుమందుల నిర్వహణ బిల్లు2025’లిను ప్రతిపాదించి, నకిలీ తయారీదారుల ఆటకట్టించేందుకు రంగం సిద్ధం చేసింది..

**భయం చుట్టూ విస్తరిస్తున్న వ్యాపార సామ్రాజ్యం**

నేటి వ్యవసాయంలో పురుగుమందుల వినియోగం ఒక అవసరం కాదు రైతుకు ఒక అత్యవసర పరిస్థితిగా మారిపోయింది.పంటలో చిన్న తెగులు, పురుగు కనిపించినా, “మొత్తం పంట నాశనం అవుతుందేమో” అన్న భయం


(మిగతా 2వ పేజీలో..)


# నేను పార్టీ అధ్యక్షుడిని అయ్యే నాటికి పార్టీ పరిస్థితి క్లిష్టంగా ఉంది: రేవంత్ రెడ్డి

**పార్టీలో కొందరి నుంచి వ్యతిరేకత ఎదుర్కొన్నానని తెలిపిన రేవంత్ రెడ్డి**

**నేతలందరినీ కలిసి తన ఆలోచన చెప్పి వారిని ఒప్పించానన్న ముఖ్యమంత్రి**

**అందరి కృషి వల్ల తెలంగాణలో పార్టీ తిరిగి పుంజుకున్నదన్న ముఖ్యమంత్రి**



తాను టీపీసీసీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టే నాటికి పార్టీ పరిస్థితి క్లిష్టంగా ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ పార్టీ నాయకుడు రేవంత్ రెడ్డి అన్నారు. పార్టీలో కూడా కొందరి నుంచి వ్యతిరేకత ఎదుర్కొన్నానని, నేతలందరినీ కలిసి తన ఆలోచన చెప్పి వారిని ఒప్పించానని గుర్తుచేసుకున్నారు. వికారాబాద్ జిల్లా అనంతగిరిలో నిర్వహించిన ఏపీ, తెలంగాణ డీసీసీ అధ్యక్షుల ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.కాంగ్రెస్ పార్టీలో తొలి నుంచి భిన్నాభిప్రాయాలు వెలువరించే స్వేచ్ఛ ఉందని అన్నారు. భిన్నాభిప్రాయాలు చెప్పినంత మాత్రాన వారిని వేధించే సంస్కృతి కాంగ్రెస్ పార్టీలో లేదని వెల్లడించారు. మనలో మనం కొట్టుకుంటే పార్టీలో కష్టపడి పనిచేసే లక్షలాది మంది కార్యకర్తలకు అన్యాయం చేసినట్లు అవుతుందని అన్నారు. అందరి కృషి వల్లే తెలంగాణలో


(మిగతా 2వ పేజీలో..)


# కొండాపూర్‌లో హైడ్రా భారీ ఆపరేషన్.. రూ.1,400 కోట్ల విలువైన భూమికి రక్షణ

**కొండాపూర్‌లో 7 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడిన హైడ్రా**

**కబ్జాకు గురైన పార్కులు, ప్రజావసరాల స్థలాలను స్వాధీనం చేసుకున్న హైడ్రా**

**ఆక్రమణలు తొలగించి, స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసిన అధికారులు**

**కాలనీ సంక్షేమ సంఘం ఫిర్యాదుతో కదిలిన యంత్రాంగం**

**దశాబ్దాల సమస్య పరిష్కారమవడంతో స్థానికుల ఆనందం**

హైదరాబాద్ నగర శివారులోని అత్యంత ఖరీదైన ప్రాంతమైన కొండాపూర్‌లో కబ్జాకు గురైన సుమారు 7 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా కాపాడింది. దీని విలువ బహిరంగ మార్కెట్‌లో దాదాపు రూ.1,400 కోట్లు ఉంటుందని అంచనా. అధికారులు ఆక్రమణలను తొలగించి, శనివారం ఆస్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, ప్రభుత్వ బోర్డులను సైతం ఏర్పాటు చేశారు.వివరాల్లోకి వెళితే, రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కొండాపూర్‌లోని





(మిగతా 2వ పేజీలో..)

RNI Number
TELTEL/2023/85680

Our News Our World

మన దునియా

మన అక్షరం – మన ప్రపంచం

## నేను పార్టీ అధ్యక్షుడిని అయ్యే నాటికి పార్టీ పరిస్థితి క్లిష్టంగా ఉంది: రేవంత్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

పార్టీ తిరిగి పుంజుకున్నదని అన్నారు.డీసీసీ అధ్యక్షులుగా బాగా పనిచేసిన వారికి ఎమ్మెల్యే టిక్కెట్లు ఇచ్చామని, ఎమ్మెల్యే టిక్కెట్లు రాని వారికి ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చామని తెలిపారు. పార్టీ కోసం పనిచేసిన మరో అరవై మందికి కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు ఇచ్చామని ముఖ్యమంత్రి వెల్లడించారు. పార్టీలో అందరి పనితీరుపై నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని హెచ్చరించారు. పార్టీ కోసం శ్రమించే వారికి కచ్చితంగా న్యాయం జరుగుతుందని హామీ ఇచ్చారు. మెరిట్ ప్రకారమే పార్టీలో అవకాశాలు వస్తాయన్నారు.డీసీసీ పదవి ఎంతో విలువైనదని, దీనిని ఏమాత్రం దుర్వినియోగం చేసుకోవద్దని హితవు పలికారు. మంచి ప్రతిభ కనబరిస్తే ఆ తర్వాత ఎమ్మెల్యే, మంత్రి, ముఖ్యమంత్రి కూడా కావొచ్చని అన్నారు. నాయకులు ఎప్పుడూ ప్రజల్లో ఉండాలని సూచించారు. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాదయాత్ర చేసి ప్రజల మధ్య రోజుల తరబడి ఉన్నారని అన్నారు.ప్రజల సమస్యలు తెలుసుకోవడానికి రాహుల్ గాంధీ కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు పాదయాత్ర చేశారని గుర్తుచేశారు. మోతీలాల్ నెహ్రూ దేశం కోసం వేల కోట్ల రూపాయలను ఆ రోజుల్లోనే త్యాగం చేశారని, జవహర్ లాల్ నెహ్రూ జైల్లో ఉన్నారని తెలిపారు. ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ దేశం కోసం ప్రాణాలు అర్పించారని తెలిపారు.

## కొండాపూర్‌లో హైడ్రా భారీ ఆపరేషన్.. రూ.1,400 కోట్ల విలువైన భూమికి రక్షణ

(మొదటి పేజీ తరువాయి)

సర్వే నంబర్ 78 నుంచి 93 పరిధిలో రాజరాజేశ్వరి నగర్ కాలనీ పేరుతో 1993లో గ్రామపంచాయతీ లేఅవుట్ వేశారు. ఈ లేఅవుట్‌లో ప్రజా ప్రయోజనాల కోసం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు 5 ఎకరాలు, పాఠశాలకు ఒక ఎకరా, పార్కులకు ఎకరాకు పైగా, కమ్యూనిటీ హాల్ కోసం 2181 గజాల స్థలాన్ని కేటాయించారు. అయితే, కాలక్రమేణా ఈ విలువైన స్థలాలు కబ్జాకు గురయ్యాయి. పాఠశాల స్థలంలో అపార్ట్‌మెంట్, కమ్యూనిటీ హాల్ స్థలంలో ప్రైవేటు దుకాణాలు, షెడ్లు వెలిశాయి.ఈ ఆక్రమణల వెనుక బడాబాబులు ఉన్నారని, ప్రజావసరాల కోసం కేటాయించిన భూములను కాపాడాలని రాజరాజేశ్వరి నగర్ కాలనీ సంక్షేమ సంఘం హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేసింది. లేఅవుట్‌లోని ప్లాట్లు ఎల్‌ఆర్‌ఎస్ అయినప్పుడు, పార్కులు, ప్రజావసరాల స్థలాలు ఎలా ఆక్రమణదారుల సొంతమవుతాయని వారు ప్రశ్నించారు.ఈ ఫిర్యాదుపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వెంటనే స్పందించి, అధికారులను క్షేత్రస్థాయి పరిశీలనకు ఆదేశించారు. లేఅవుట్ ప్రకారం ఆ భూములు ప్రజావసరాలకు చెందినవేనని నిర్ధారించుకున్న అధికారులు, వెంటనే ఆక్రమణలను తొలగించి, భూమి చుట్టూ ఫెన్సింగ్ వేశారు. దశాబ్దాలుగా పరిష్కారం కాని తమ సమస్యకు హైడ్రా పరిష్కారం చూపడంతో రాజరాజేశ్వరి నగర్‌లోని సుమారు 5 వేల కుటుంబాలు హర్షం వ్యక్తం చేశాయి. తమకు అండగా నిలిచిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపాయి.

## కోర్టు తీర్పుపై ట్రంప్ 'యుద్ధం'.. విదేశీ శక్తుల ప్రభావం ఉందంటూ సంచలన ఆరోపణలు!

### సుప్రీంకోర్టు తీర్పు తీవ్ర నిరాశ కలిగించిందన్న ట్రంప్

### న్యాయమూర్తులపై విదేశీ శక్తుల ఒత్తిడి ఉందేమోనని అనుమానం

### కొత్తగా 10 శాతం గ్లోబల్ టారిఫ్ విధింపు

### అవసరమైతే వాణిజ్య దిగ్బంధం విధిస్తానని హెచ్చరిక




తన పన్నుల విధింపు అధికారాన్ని కట్టడి చేస్తూ అమెరికా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు . శ్వేతసౌధంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన న్యాయవ్యవస్థపై ధ్వజమెత్తారు. ఈ తీర్పు దేశానికి తీరని అవమానమని, కొందరు న్యాయమూర్తులకు దేశం కోసం సరైన నిర్ణయం తీసుకునే ధైర్యం లేదని విమర్శించారు. అంతటితో ఆగకుండా, ఈ తీర్పు వెనుక 'విదేశీ ప్రయోజనాలు' ఉన్నాయని, న్యాయమూర్తులు బయటి వ్యక్తుల ప్రభావానికి లోనయ్యారని సంచలన ఆరోపణలు చేశారు.సుప్రీంకోర్టు తీర్పు తనను ఆపలేదని ట్రంప్ స్పష్టం చేశారు. పాత చట్టం (IEEPA) కింద వేసిన పన్నులను కోర్టు కొట్టివేస్తే, తక్షణమే 'సెక్షన్ 122' కింద 10 శాతం గ్లోబల్ టారిఫ్ విధిస్తూ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం చేశారు. "నేను ఎంత పన్ను వేయాలనుకుంటే అంత వేస్తాను. పాత చట్టాల కంటే ఇప్పుడు మా దగ్గర ఉన్నవి చాలా శక్తిమంతమైనవి. అవసరమైతే ఏ దేశంపైనైనా వాణిజ్య దిగ్బంధం విధిస్తాను, ఇతర దేశాల వాణిజ్యాన్ని దెబ్బతీసే అధికారం నాకుంది" అంటూ ఆయన తన దూకుడును ప్రదర్శించారు.సుంకాల విధింపు వల్ల అమెరికాలో పరిశ్రమలు కళకళలాడుతున్నాయని ట్రంప్ చెప్పుకొచ్చారు. జార్జియాలోని ఒక స్టీల్ ప్లాంట్ యజమాని తనను కలిసి "సార్, మిమ్మల్ని ముద్దు పెట్టుకోవాలని ఉంది" అని అన్నారని ఆయన గుర్తు చేసుకున్నారు. విదేశీ వస్తువుల దిగుమతి ఆగిపోవడంతో అమెరికాలో నిరుద్యోగం తగ్గిందని, స్టాక్ మార్కెట్ (Dow Jones) 50 వేల మార్కును దాటిందని ఆయన గర్వంగా ప్రకటించారు.సుప్రీంకోర్టు తీర్పుతో గతంలో వసూలు చేసిన సుమారు 175 బిలియన్ డాలర్ల పన్ను ఆదాయం ఇప్పుడు అనిశ్చితిలో పడింది. ఆ డబ్బును వెనక్కి ఇవ్వాల్సి ఉంటుందా? అన్న ప్రశ్నకు.. "కోర్టు ఆ విషయం గురించి చర్చించలేదు, దీనిపై మరో ఐదేళ్ల పాటు కోర్టులో పోరాటం సాగుతుంది" అని ట్రంప్ దాటవేశారు.

# "సాగును కాటేస్తున్న 'నకిలీ' విషం:

## అన్నదాత భయమే పెట్టుబడిగా రసాయన మాఫియా పంజా!"

(మొదటి పేజీ తరువాయి)

రైతును వెంటాడుతుంది. అదే భయాన్ని అవకాశంగా మలుచుకుని, కొన్ని కంపెనీలు నాణ్యత లేని రసాయనాలను ఆకర్షణీయమైన ప్యాకింగ్‌లతో మార్కెట్లోకి నెట్టేస్తున్నాయి.నిపుణుల అంచనాల ప్రకారం, దేశంలో ఏటా రూ.6,0008,000 కోట్ల వరకు నకిలీ పురుగుమందుల వ్యాపారం సాగుతోంది. రైతు పెట్టే పెట్టుబడిలో దాదాపు 25 శాతం నేరుగా నష్టంగా మారుతోందన్నది చేదు నిజం...

నకిలీల కాటు రైతుకే కాదు,వ్యవస్థకే ముప్పు

నకిలీ పురుగుమందుల ప్రభావం రైతు జేబుతోనే ఆగిపోవడం లేదు. వ్యవసాయ వ్యవస్థ మొత్తం దీని వల్ల దెబ్బతింటోంది.రోగాలు తగ్గకపోగా పంట ఎండిపోవడం, పెరుగుదల ఆగిపోవడం దిగుబడులు పడిపోవడంతో రైతు అప్పుల ఊబిలోకి జారుకోవడం.

భూసారం క్రమంగా నాశనం కావడం

భూగర్భజలాలు,పర్యావరణం కలుషితం కావడం ఇవే కాకుండా, పిచికారీ సమయంలో సరైన రక్షణ లేకపోవడం వల్ల రైతుల్లో శ్వాసకోస వ్యాధులు, చర్మ సమస్యలు పెరుగుతున్నాయి. చివరికి ఆ విషపదార్థాలే మన ఆహారంలోకి చేరి సామాన్యుడి ఆరోగ్యానికీ ముప్పుగా మారుతున్నాయి..

కొత్త చట్టం: నకిలీ రాయుళ్లకు భయం కలిగించేనా!

ప్రస్తుతం అమల్లో ఉన్న 1968 నాటి కీటక నాశిని చట్టం నేటి పరిస్థితులకు సరిపోవడం లేదు. నామమాత్రపు జరిమానాలు, బలహీన శిక్షలు నకిలీ మాఫియాకు ఎలాంటి భయం కలిగించలేకపోయాయి.

ఈ లోపాలను సరిదిద్దేందుకే కేంద్ర ప్రభుత్వం లి'పురుగుమందుల నిర్వహణ బిల్లు2025'లిను తీసుకొచ్చింది. ఈ బిల్లుపై ఫిబ్రవరి 4లోపు అభిప్రాయాలు, సూచనలు పంపాలని కేంద్రం కోరింది..

కఠిన చట్టం.. రైతుకు రక్షణ కవచం

వ్యవసాయ రంగంలో తిష్టవేసిన నకిలీ మాఫియా అంతానికి ప్రభుత్వం సిద్ధం చేసిన ఈ నూతన నిబంధనలు అన్నదాతకు కొండంత అండగా నిలుస్తున్నాయి. ముఖ్యంగా:

శిక్షల కొరడా – నకిలీలకు చెక్: నకిలీ లేదా నిషేధిత పురుగుమందుల తయారీ, విక్రయాలే లక్ష్యంగా విధిస్తున్న రూ. 50 లక్షల గరిష్ఠ జరిమానా, ఐదేళ్ల జైలు శిక్ష వంటి నిబంధనలు అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నాయి. ఇది కేవలం శిక్ష మాత్రమే కాదు, నకిలీల సామ్రాజ్యాన్ని వేళ్లతో సహా పెకిలించే గట్టి హెచ్చరిక. డిజిటల్ పర్యవేక్షణ – పారదర్శక ప్రయాణం: 'క్యూఆర్ కోడ్' ఆధారిత ట్రేసిబిలిటీ వ్యవస్థ ద్వారా ప్రతి బాటిల్ ప్రయాణాన్ని తయారీ కేంద్రం నుండి రైతు పొలం వరకు డిజిటల్ పద్ధతిలో ట్రాక్ చేయడం సాధ్యమవుతుంది. ఈ సాంకేతిక అడ్డుకట్టతో సరఫరా గొలుసులో నకిలీలు ప్రవేశించే అవకాశమే లేకుండా పోతుంది. పరిహార హక్కు – తక్షణ న్యాయం: నాణ్యత లేని మందుల వల్ల పంట నష్టపోతే, రైతు కోర్టుల చుట్టూ తిరిగే అవసరం లేకుండా నేరుగా కంపెనీల నుంచే పరిహారం పొందే వెసులుబాటు కల్పించడం ఒక విప్లవాత్మక మార్పు. ఇది రైతుకు ఆర్థిక భరోసాతో పాటు చట్టబద్ధమైన రక్షణను నిర్ధారిస్తుంది.కఠిన నియంత్రణ – లైసెన్సుల రద్దు: కేవలం జరిమానాలతో సరిపెట్టకుండా, నిబంధనలు ఉల్లంఘించే డీలర్లు మరియు తయారీదారుల లైసెన్సులను శాశ్వతంగా రద్దు చేసే అధికారం అధికారులకు ఇవ్వడం అభినందనీయం. ఈ చర్య వ్యవసాయ ఇన్‌పుట్ల రంగంలో జవాబుదారీతనాన్ని పెంచి, నైతిక విలువల తో కూడిన వ్యాపారానికి మార్గం సుగమం చేస్తుంది.

అప్రమత్తతే రైతును కాపాడేది

"నకిలీ విత్తనాలు, కల్తీ ఎరువుల నియంత్రణకు చట్టాలు ఎన్ని కఠినంగా రూపొందించినప్పటికీ, క్షేత్రస్థాయిలో రైతు అప్రమత్తతే అన్నింటికన్నా బలమైన రక్షణ కవచం. ప్రతి కొనుగోలులోనూ పారదర్శకత ఉండాలి; కంపెనీ పేరు, బ్యాచ్ సంఖ్య స్పష్టంగా నమోదైన 'పక్కా బిల్లు' తీసుకోవడం రైతు బాధ్యత మాత్రమే కాదు, మోసపోతే పోరాడేందుకు ఒక ఆయుధం కూడా. డీలర్ల వ్యాపార ప్రయోజనాలకు ప్రభావితం కాకుండా, వ్యవసాయాధికారుల శాస్త్రీయ సలహాలకు పెద్దపీట వేయాలి. అనవసర రసాయన ప్రయోగాలతో సాగును సంక్షోభంలోకి నెట్టుకోకుండా విజ్ఞతతో వ్యవహరించాలి. ఎక్కడ నకిలీల ఆనవాళ్లు కనిపించినా, వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లడం ద్వారా తనతో పాటు తోటి రైతుల ప్రయోజనాలను కాపాడే సామాజిక బాధ్యతను ప్రతి కర్షకుడు స్వీకరించాలి." అన్నదాతను పట్టి పీడిస్తున్న నకిలీల బెడదను అరికట్టడం వ్యవస్థల కర్తవ్యమే కాదు, సామాజిక బాధ్యత కూడా. చట్టాల అమలులో కఠినత్వం, కార్పొరేట్ శక్తుల ప్రలోభాల నుంచి రైతుకు రక్షణ కల్పించినప్పుడే సాగు లాభసాటిగా మారుతుంది. అవగాహనతో కూడిన శాస్త్రీయ సాగు వైపు రైతు అడుగులు వేయడమే 'రైతే రాజు' నినాదానికి అసలైన సార్థకత."

# ముగిసిన ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్–2026... న్యూఢిల్లీ డిక్లరేషన్‌కు 88 దేశాల ఆమోదం

### ఏఐపై ప్రపంచ ఏకాభిప్రాయం

### సర్వజన హితాయ, సర్వజన సుఖాయ' స్ఫూర్తితో డిక్లరేషన్ రూపకల్పన

### ఏడు కీలక స్తంభాల ఆధారంగా ఏఐపై అంతర్జాతీయ సహకారానికి పిలుపు

### ఆర్థిక వృద్ధి, సామాజిక శ్రేయస్సు కోసం ఏఐని ఉపయోగించాలని తీర్మానం

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) రంగంలో అంతర్జాతీయ సహకారానికి సంబంధించి భారత్ కీలక ముందడుగు వేసింది. న్యూఢిల్లీ వేదికగా జరిగిన మెగా 'ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026' శనివారం విజయవంతంగా ముగిసింది. ఈ సదస్సులో 'న్యూఢిల్లీ డిక్లరేషన్ ఆన్ ఏఐ ఇంపాక్ట్'ను ఆమోదించారు. భారత్‌తో సహా 88 దేశాలు, అంతర్జాతీయ సంస్థలు దీనికి మద్దతు తెలపడం ప్రపంచ ఏకాభిప్రాయానికి నిదర్శనంగా నిలిచింది. ఆర్థిక వృద్ధి, సామాజిక శ్రేయస్సు కోసం ఏఐని ఎలా ఉపయోగించుకోవాలనే దానిపై ఈ డిక్లరేషన్ ఒక స్పష్టమైన మార్గాన్ని నిర్దేశిస్తోంది.'సర్వజన హితాయ, సర్వజన సుఖాయ' (అందరి సంక్షేమం, అందరి ఆనందం) అనే భారతీయ తాత్విక సూత్రాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఈ డిక్లరేషన్‌ను రూపొందించారు. ఏఐ ద్వారా లభించే ప్రయోజనాలు ప్రపంచంలోని ప్రతి ఒక్కరికీ సమానంగా అందాలనే ఆశయాన్ని ఇది పునరుద్ఘాటించింది. "వసుధైవ కుటుంబకం" (ప్రపంచమంతా ఒకే కుటుంబం) అనే భావనతో, అన్ని దేశాలు తమ పౌరుల ప్రయోజనాల కోసం ఏఐని అభివృద్ధి చేసి, వినియోగించుకునేలా వనరులను అందుబాటులోకి తీసుకురావాల్సిన ప్రాముఖ్యతను ఈ తీర్మానం నొక్కి చెప్పింది. అంతర్జాతీయ సహకారాన్ని బలోపేతం చేయడం, అన్ని భాగస్వామ్య పక్షాలను కలుపుకొనిపోవడం, దేశాల సార్వభౌమత్వాన్ని గౌరవించడం, విశ్వసనీయమైన ఫ్రేమ్‌వర్క్‌ల ద్వారా ఏఐ పురోగతిని ప్రోత్సహించడం వంటి అంశాలకు ఇందులో ప్రాధాన్యత ఇచ్చారు.

ఈ డిక్లరేషన్ ఏడు కీలక స్తంభాల ఆధారంగా రూపొందింది.

1. ఏఐ వనరుల ప్రజాస్వామ్యీకరణ (Democratising AI Resources)
2. ఆర్థిక వృద్ధి, సామాజిక శ్రేయస్సు (Economic Growth and Social Good)
3. సురక్షితమైన, విశ్వసనీయమైన ఏఐ (Secure and Trusted AI)
4. శాస్త్రీయ ప్రగతికి ఏఐ (AI for Science)
5. సామాజిక సాధికారతకు ఏఐ లభ్యత (Access for Social Empowermen)
6. మానవ వనరుల అభివృద్ధి (Human Capital Developmen)
7. స్థిరమైన, సమర్థవంతమైన, వినూత్నమైన ఏఐ వ్యవస్థలు (Resilient, Efficient and Innovative AI Systems)

"ఏఐని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలంటే పటిష్టమైన డిజిటల్ మౌలిక సదుపాయాలు, అందరికీ అందుబాటులో ఉండే అర్థవంతమైన కనెక్టివిటీ అత్యంత అవసరం" అని ఈ డిక్లరేషన్ స్పష్టం చేసింది. ఓపెన్ సోర్స్, ఇంధన సామర్థ్యం గల ఏఐ మౌలిక సదుపాయాల అవసరాన్ని కూడా ఇది హైలైట్ చేసింది. 'చార్టర్ ఫర్ ది డెమొక్రాటిక్ డిఫ్యూజన్ ఆఫ్ ఏఐ' అనే స్వచ్ఛంద, నిర్బంధం లేని ఫ్రేమ్‌వర్క్‌ను కూడా ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఇది జాతీయ చట్టాలను గౌరవిస్తూనే, ఏఐ వనరులను అందరికీ అందుబాటులోకి తీసుకురావడానికి, స్థానిక ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి దోహదపడుతుంది.శాస్త్రీయ పరిశోధన, అభివృద్ధి, పాలన, ప్రభుత్వ సేవల వంటి రంగాల్లో ఏఐ పాత్రను విస్తరించాలని డిక్లరేషన్ పిలుపునిచ్చింది. సురక్షితమైన, నమ్మకమైన ఏఐ వ్యవస్థలను నిర్మించడం ద్వారానే ప్రజల్లో విశ్వాసం పెరిగి, దాని పూర్తి ప్రయోజనాలను పొందగలమని పేర్కొంది. ఈ సమ్మిట్ ద్వారా ఏర్పడిన ఏకాభిప్రాయం, భవిష్యత్తులో ఏఐని మానవాళి ఉజ్వల భవిష్యత్తు కోసం ఉపయోగించుకోవడానికి అవసరమైన అంతర్జాతీయ సహకారానికి మార్గం సుగమం చేస్తుందని సభ్య దేశాలు ఆశాభావం వ్యక్తం చేశాయి.



## పీడిత వర్గాల సమానత్వం కోసం కృషి చేసిన మహనీయుడు సంత్ సేవాలాల్: : రాష్ట్ర దేవాదాయ అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ









- సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్ 287 వ జయంతి ఉత్సవం లో పాల్గొన్న మంత్రి...
- బంజారా మహిళ తో కలిసి నృత్యం చేసిన మంత్రి.....
- బంజారాల కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం సహకారం అందిస్తా....
- విగ్రహ దొంగలను అరెస్టు చేయాలని ఏఎస్పీకి ఆదేశించిన మంత్రి.
- బంజారా కమ్యూనిటీ హాల్ కోసం నిధులు ఇస్తాము.
- పీడీత ప్రజల ఆశాజ్యోతి సేవాలాల్ మహారాజ్..
- మేయర్ గుండు సుధారాణి
- జయంతి లో పాల్గొన్న... ఆర్డీవో సుమ,ఏ ఎస్పీ శుభం, అధికారులు, బంజారా నేతలు

**మన దునియా,వరంగల్,ఫిబ్రవరి 21**

పీడిత వర్గాల సమానత్వం కోసం కృషి చేసిన మహనీయుడు సంత్ సేవాలాల్ అని రాష్ట్ర దేవాదాయ అటవీ పర్యావరణ శాఖ మంత్రి వర్యులు కొండా సురేఖ కొనియాడారు. సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్ 287 వ జయంతిని పురస్కరించుకొని వరంగల్ పరిధి 19 వ డివిజన్ కాశీబుగ్గ లో ఏర్పాటు చేసిన కార్యక్రమం లో మంత్రి పాల్గొని బంజారాలతో కలిసి నృత్యాలు చేసి సంత్ సేవాలాల్ చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి డోలు వాయించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం డి టి డి ఓ నారాయణ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన అధికారిక కార్యక్రమం లో మంత్రి మాట్లాడుతూ బంజారాల ఆరాధ్య దైవం గురువు సంత్ సేవాలాల్ అని ఆయనను జగదాంబ మాత అంశంగా బంజారాలు భావిస్తారని తన జీవితాన్ని సమాజ సేవ కోసం అంకితం చేశారని ఆయన చేసిన సామాజిక సేవలు సంస్కరణలు అనేకం అని సేవాలాల్ మహారాజ్ కేవలం ఆధ్యాత్మిక గురువే కాదని బంజారాల జాతిని చైతన్యం చేసిన గొప్ప మహనీయుడని ఆ కాలంలో ఉన్న మూఢనమ్మకాలను జంతు బలులను తీవ్రంగా వ్యతిరేకించారని జీవ హింస మహా పాపం అని చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని మద్యపానం ధూమపానం మనిషి తో పాటు గా కుటుంబాలను నాశనం చేస్తాయని వాటిని విడనాడాలని సేవాలాల్ సూచించారని వందల సంవత్సరాల క్రితమే మహిళలకు సమాన గౌరవం ఇవ్వాలని వారిని గౌరవించాలని ప్రబోధించిన మహనీయుడు సంత్ సేవాలాల్ అని ఆయుర్వేదం పట్ల అవగాహన ఉండడం వల్ల ప్రకృతి వైద్యం తో అనేక మందిని రోగాల నుండి విముక్తి కలిగించారని అన్నారు. మహిళలు, పీడిత వర్గాల సమానత్వం కోసం సేవాలాల్ మహారాజ్ చేసిన కృషి భావితరాలకు స్ఫూర్తిదాయకం ఆచరణీయమని, బంజారా బిడ్డల ఆత్మగౌరవాన్ని నిలబెట్టి, వారి అభివృద్ధి కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని ఈ సందర్భం గా మంత్రి తెలిపారు.సత్యం, అహింస, మానవత్వం, సమానత్వానికి ఉన్నతమైన నైతిక విలువల సందేశాన్ని వ్యాప్తి చేయడం ద్వారా సమాజంలో నూతన చైతన్యాన్ని నింపారని, ఆయన స్ఫూర్తిదాయకమైన జీవితం దేశ ప్రజలకు ఎప్పటికీ మార్గదర్శకంగా నిలుస్తుందని సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా ఆ మహనీయుడు చూపిన శాంతి మార్గాన్ని, ఆయన బోధించిన జీవన విలువలను మనసారా స్మరించుకుందామని మంత్రి పిలుపునిచ్చారు. నగరం లో బంజారాల కోసం సంత్ సేవాలాల్ ఆలయ నిర్మాణం తో పాటు కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి చర్యలు చేపట్టనున్నట్లు ఇందుకోసం జిల్లా కలెక్టర్, మేయర్ లతో చర్చించి ఏర్పాటు కు సహకరిస్తామని అన్నారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణ క్రమం లో అక్కడే సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహం ఏర్పాటు చేస్తే బాగుంటుందని, బంజారాలకు గిరిజనులకు రెండు పడకల గదుల ఇళ్ళను అందజేయడానికి బంజారా ప్రతినిధులు రాతపూర్వకం గా వినతి పత్రం అందజేస్తే పరిశీలిస్తామని, గతం లో ఖమ్మం రోడ్డు ప్రాతం లో దొంగిలించబడ్డ విగ్రహం కు సంబంధించి అట్టి చర్యకు పాల్పడిన వారిపై చర్యలు చేపట్టాలని ఏ సి పి ను ఆదేశిస్తున్నట్లు ఈ సందర్భం గా మంత్రి తెలిపారు. నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి మాట్లాడుతూ సేవాలాల్ జయంతిని ప్రభుత్వం అధికారికం గా నిర్వహించడం అభినందనీయం అని,సంత్ సేవాలాల్ కేవలం బంజారాలకే కాకుండా అన్ని వర్గాల ప్రజల కోసం సేవలు అందించారు సంపద కంటే సంస్కారం ముఖ్యమని,అధికారం కంటే ఆదర్శం ప్రధానమని సూచించారని మేయర్ అన్నారు.ఈ సందర్భం గా బంజారా ప్రతినిధులు మంత్రి, మేయర్ అధికారులు కార్పొరేటర్ లు మీడియా ప్రతినిధులను బంజారాల సంప్రదాయ తలపాగాలను ధరింపజేసి శాలువాలతో సత్కరించారు.ఈ కార్యక్రమం లో జయంతి నిర్వహణ కమిటీ చైర్మన్ భూక్య మోతిలాల్ నాయక్ కార్పొరేటర్ లు పోశాల పద్మ ఓని స్వర్ణలత భాస్కర్ వస్కుల బాబు బాల్నే సురేష్ చింతాకుల అనిల్ కుమార్, బసవరాజు కుమారస్వామి, ఆర్ డి ఓ సుమ ఏ సి పి శుభం, ట్రైనీ ఐ పి ఎస్ మనీషా, కాంగ్రెస్ జిల్లా నాయకులు గోపాల నవీన్ రాజ్.గోర్ సిక్వాడి మీడియా వింగ్ అధ్యక్షులు బాలాజీ నాయక్, గొర్ సేనా అధ్యక్షులు ఫణి కుమార్, జవహర్ లాల్,తిరుపతి, వినేష్,లోక్ నాయక్, ఈర్య, విజయ్, మల్సూర్, సజ్జ న్, ఉదయ్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

## చిలక్కి చెప్పినట్లు చెప్పినా వినలేదు!

**డిజిటల్ మోసం నుంచి ఓసారి రక్షించిన పోలీసులు**

**15 రోజులకు మళ్లీ కాల్..రూ.49 లక్షలు మోసపోయిన వైనం**

**మన దునియా,అమరావతి: ఫిబ్రవరి 21**

అమరావతి: డిజిటల్ అరెస్టు అనేది లేదని, ఆ పేరుతో వచ్చే కాల్సు స్పందించవద్దని పోలీసులు ఆ విశ్రాంత ఉద్యోగికి చిలక్కి చెప్పినట్లు చెప్పారు. రూ. 72.50 లక్షలు బదిలీ చేసేందుకు బ్యాంకుకు వచ్చిన అతణ్ని ఆపారు. ఎవరైనా ఇబ్బంది పెడితే.. తమను సంప్రదించాలని భరోసా ఇచ్చి మరీ పంపించారు. 15 రోజుల్లోనే మళ్లీ అలాంటి కాల్ రావడంతో ఈసారి ఆ విశ్రాంత ఉద్యోగి భయపడి, మోసగాళ్లకు రూ. 49 లక్షలు బదిలీ చేసేశారు. విజయవాడలో స్థిరపడిన స్టీల్ ప్లాంట్ విశ్రాంత ఉద్యోగి (65)కి గత నెలాఖరులో ఈడీ నుంచి ఫోన్ చేస్తున్నామంటూ ఓ కాల్ వచ్చింది.మీపై కేసులున్నాయని బెదిరించారు. యూనిఫాంలో ఉండి వీడియో కాల్ చేసిన ఓ వ్యక్తి తాను దర్యాప్తు అధికారినని, రూ. 72.50 లక్షలు ఇస్తే కేసు మాఫీ చేస్తానని అన్నాడు. దీంతో విశ్రాంత ఉద్యోగి విజయవాడ రామచంద్రనగర్లోని ఎస్బీఐ బ్రాంచికి వెళ్లారు. తన పేరిట ఉన్న రూ. 78 లక్షల ఫిక్స్ డిపాజిట్లను రద్దు చేసి, అందులో రూ. 72.50 లక్షలను మరో ఖాతాకు బదిలీ చేయాలని కోరారు. అనుమానం వచ్చిన బ్యాంకు అధికారులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి ఆ ఖాతా నంబరు పరిశీలిస్తే అది కోల్కతాకు చెందినదని తేలింది. దీంతో లావాదేవీ నిలిపేసి, మోసాలపై అవగాహన కల్పించి పంపించారు.



**అయినా వినలేదు: తర్వాత విశ్రాంత ఉద్యోగి మళ్లీ**

బ్యాంకుకు వచ్చి, తాము బెంగళూరుకు మారిపోతున్నామని చెప్పి.. ఎఫ్డీ క్లోజ్ చేసి, ఆ మొత్తాన్ని తన పొదుపు ఖాతాలోకి బదిలీ చేయించుకున్నారు. అనంతరం నగరంలోని ఇండియన్ బ్యాంకులో ఖాతా తెరిచారు. అక్కడి నుంచి మోసగాళ్ల ఖాతాకు రూ. 49 లక్షలు బదిలీ చేశారు. ఆ సమయంలో బ్యాంకు సిబ్బంది ప్రశ్నించినా.. తెలిసిన వ్యక్తికే పంపిస్తున్నానని చెప్పారు. తీరిగ్గా నాలుగు రోజుల తర్వాత పోలీసులను ఆశ్రయించారు.

## హైదరాబాద్‌లో గడువు ముగిసిన మందులు ఇచ్చిన వైద్యులు.. 6 నెలల బాబు మృతి

**మన దునియా,హైదరాబాద్: ఫిబ్రవరి 21**



బండ్లగూడ జాగీరు - సన్ సిటి పరిధిలో రాము అనే 6 నెలల బాబుకు జ్వరం రావడంతో సమీపంలోని క్రియాన్స్ ఆసుపత్రికి తీసుకెళ్లిన తల్లిదండ్రులు అక్కడ వైద్యులు గడువు ముగిసిన మందులు ఇచ్చినట్లు కుటుంబ సభ్యుల ఆరోపణలు మందులు ఇచ్చిన కొద్దిసేపటికే ఆరోగ్యం విషమించి మృతి చెందిన బాలుడు ఆసుపత్రి డాక్టర్ల నిర్లక్ష్యంతోనే బాలుడు మృతి చెందాడని, సంబంధింత అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆవేదన వ్యక్తం చేసిన బాధిత కుటుంబసభ్యులు ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేసి, ఆసుపత్రి డాక్టర్ల నిర్లక్ష్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసిన స్థానికులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు

## బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం.. ఏపీలో వర్షాలు..


**మన దునియా,ఆంధ్రప్రదేశ్: ఫిబ్రవరి 21**



ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఉపశమనం కలిగించే వార్తను విపత్తుల నిర్వహణ సంస్థ వినిపించింది. మరికొన్ని గంటల్లో బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది. ప్రస్తుతం కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం.. అల్పపీడనంగా మారనుందని అంచనా వేసింది. దీని ప్రభావంతో శనివారం, ఆదివారాల్లో ఏపీలోని కొన్ని జిల్లాలలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది. పిడుగులు కూడా పడే అవకాశం ఉందని జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించింది.బిఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని వరుణుడు పలకరించనున్నాడు. హిందూ మహాసముద్రం, దానికి ఆనుకుని ఉన్న నైరుతి బంగాళాఖాతంపై ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉంది. దీని ప్రభావంతో మరికొన్ని గంటల్లో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ అంచనా వేసింది. ఈ అల్పపీడనం తర్వాత పశ్చిమ-వాయువ్య దిశగా కదిలే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు, దీని ప్రభావంతో ఏపీలో శని, ఆదివారాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేశారు. వైఎస్సార్ కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో కొన్నిచోట్ల పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసేందుకు అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. మిగతా జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. పిడుగులు పడే అవకాశాలు ఉన్న నేపథ్యంలో.. ప్రజలు చెట్ల క్రింద ఉండరాదని, పొలాల్లోని రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.మరోవైపు అల్పపీడనం ప్రభావంతో శని, ఆదివారాల్లో ఏపీతో పాటుగా పలు రాష్ట్రాల్లోనూ వర్షాలు కురవనున్నాయి. తమిళనాడు, కేరళతో పాటుగా అండమాన్, నికోబార్ దీవులలో పలుచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేశారు. అలాగే హిమాచల్ ప్రదేశ్, మధ్యప్రదేశ్, బెంగాల్, ఝార్ఖండ్ రాష్ట్రాల్లో తేలికపాటి వర్షాలు కురిసేందుకు అవకాశం ఉందని అంచనా వేశారు. మరోవైపు శని, ఆది, సోమవారాల్లో రాష్ట్రంలో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని అమరావతి వాతావరణ కేంద్రం కూడా అంచనా వేసింది.మరోవైపు తెలుగు రాష్ట్రాల్లో చలి వాతావరణం తగ్గి.. క్రమంగా ఎండలు పెరుగుతున్నాయి. కొన్నిచోట్ల 35 డిగ్రీల వరకూ ఉష్ణోగ్రతలు నమోదవుతున్న పరిస్థితి. ఇలాంటి సమయంలో వర్షాలు కురుస్తాయన్న వాతావరణశాఖ ప్రకటన ఉపశమనం కలిగిస్తోంది. వేడి వాతావరణం, ఉక్కబోత నుంచి రిలీఫ్ దక్కుతుందని జనం భావిస్తున్నారు. అయితే పిడుగులు పడే అవకాశం ఉందని.. జాగ్రత్తగా ఉండాలని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ చెప్తోంది. వర్షం పడే సమయంలో బహిరంగ ప్రదేశాల్లో ఉండవద్దని.. చెట్ల కింద నిలబడవద్దని సూచిస్తోంది. అలాగే కరెంట్ పోల్స్, పాడుబడిన భవనాల సమీపంలో ఉండవద్దంటూ ప్రజలను అప్రమత్తం చేస్తోంది.

## భార్య గౌరవాన్ని వేలానికి పెట్టిన భర్తడ నీలి వెబ్‌సైట్లలో రహస్య వీడియోలు అప్‌లోడ్, రేవాలో సంచలనం

**మన దునియా,రేవా,మధ్యప్రదేశ్: ఫిబ్రవరి 21**



రేవా (మధ్యప్రదేశ్): భార్యను నీలి చిత్రాల స్టార్‌గా చూపించాలని నీచ ఆలోచనతో ఓ వ్యక్తి చేసిన దారుణం మధ్యప్రదేశ్‌లోని రేవా నగరంలో వెలుగుచూసింది. భార్య అనుమతి లేకుండా బెడ్‌రూమ్‌లో రహస్యంగా వీడియోలు చిత్రీకరించి, వాటిని నీలి వెబ్‌సైట్లలో అప్‌లోడ్ చేయడం తీవ్ర సంచలనం సృష్టించింది.పోలీసుల వివరాల ప్రకారం, భర్త గోప్యంగా చిత్రీకరించిన వీడియోలో మొదటి 12 నిమిషాల భాగాన్ని ఒక నీలి వెబ్‌సైట్‌లో పెట్టాడు. ఈ విషయం యాదృచ్ఛికంగా తెలిసిన భార్య తీవ్ర ఆవేదనకు గురైంది. వెంటనే తన తల్లిదండ్రులకు సమాచారం అందించింది. కుటుంబ సభ్యుల సహకారంతో బాధితురాలు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు ఐటీ చట్టం మరియు మహిళల గౌరవానికి భంగం కలిగించే సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. కేసు నమోదు అయిన విషయం తెలిసిన నిందితుడు ముంబైకి పారిపోయినట్లు సమాచారం. అయితే, అతని సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా ట్రాకింగ్ చేపట్టిన పోలీసులు త్వరలోనే అదుపులోకి తీసుకుంటామని తెలిపారు.ఈ ఘటన మహిళల వ్యక్తిగత గోప్యతకు విఘాతం కలిగించే తీవ్రమైన నేరమని, ఇలాంటి చర్యలు కఠిన శిక్షలకు దారితీస్తాయని పోలీసులు హెచ్చరించారు. డిజిటల్ యుగంలో సాంకేతికతను దుర్వినియోగం చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, బాధితులు భయపడకుండా వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు.ఈ సంఘటన స్థానికంగా ఆగ్రహాన్ని రేకెత్తించడంతో పాటు, మహిళల భద్రత, గోప్యత అంశాలపై మళ్లీ చర్చకు దారి తీసింది.

మన Our News Our World దునియా
RNI Number TELTEL/2023/85680
మన అక్షరం – మన ప్రపంచం

# నీటిపారుదల శాఖ మాజీ జూనియర్ ఇంజనీర్ రామ్ భవన్,అతని భార్య దుర్గావతికి మరణశిక్ష విధిస్తూ చారిత్రాత్మక తీర్పునిచ్చింది.సంచలన తీర్పు...

**మన దునియా,న్యూఢిల్లీ:ఫిబ్రవరి 21**



న్యూఢిల్లీ: చిన్నారులపై దారుణ లైంగిక వేధింపులకు పాల్పడిన కామ పిశాచాలకు ఉత్తరప్రదేశ్‌లోని బాందా ప్రత్యేక పోస్కో కోర్టు మరణ శిక్ష విధించింది.నిందితులైన నీటిపారుదల శాఖ మాజీ జూనియర్ ఇంజనీర్ రామ్ భవన్,అతని భార్య దుర్గావతికి మరణశిక్ష విధిస్తూ చారిత్రాత్మక తీర్పునిచ్చింది. 2010 నుండి 2020 మధ్య కాలంలో దాదాపు 33 మంది మైనర్ బాలురపై 3 ఏళ్ల చిన్నారులతో సహా దారుణమైన లైంగిక వేధింపులకు పాల్పడినట్లు కోర్టు నిర్ధారించింది. 2 లక్షలకు పైగా అభ్యంతరకర వీడియోలు, ఫొటోలను దాదాపు 47 దేశాలకు ఇంటర్నెట్ ద్వారా చేరవేశారు. ఈ కేసును అత్యంత అరుదైనదిగా పరిగణించిన న్యాయమూర్తి ప్రదీప్ కుమార్ మిశ్రా,నిందితుల క్రూరత్వం సమాజ నైతిక పునాదులనే కదిలించిందని పేర్కొన్నారు. బాధితులైన 33 మందికి ఒక్కొక్కరికి రూ. 10 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని యూపీ ప్రభుత్వాన్ని కోర్టు ఆదేశించింది. నిందితుల ఇంట్లో స్వాధీనం చేసుకున్న నగదును కూడా బాధితులకు సమానంగా పంపిణీ చేయాలని సూచించింది. ఈ కేసును 2020లో సిబిఐ నమోదు చేసి విచారణ చేపట్టింది.నిందితులు తమ నేరాల కోసం చిత్రకూట్ ప్రాంతంలో అద్దె ఇల్లు తీసుకుని ఈ దారుణాలకు పాల్పడినట్లు తేలింది.

# కేరళలో రూ. 20 కోట్ల లాటరీ దక్కింది.. టిక్కెట్ పోయింది...

**మన దునియా,తిరువనంతపురం: ఫిబ్రవరి 21**



తిరువనంతపురం: కేరళలో అత్యంత విచిత్ర ఉదంతం చోటు చేసుకుంది.ఒక మాజీ పోలీసు అధికారికి లాటరీ రూపంలో అదృష్టం వరించినా.. అది చేజారిపోవడంతో ఇప్పుడు ఆయన పోలీసులను, చివరకు కోర్టును ఆశ్రయించారు. పిరవం ప్రాంతానికి చెందిన రిటైర్డ్ అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఏఎస్ఐ) కేకే సజిమోన్, కేరళ క్రిస్మస్–న్యూ ఇయర్ బంపర్ లాటరీలో రూ. 20 కోట్ల భారీ బహుమతి గెలుచుకున్న టికెట్ (నెం. XC 138455) తనదేనని అంటున్నారు. జనవరి 24న వెలువడిన ఈ ఫలితాల్లో తన టికెట్‌కే మొదటి బహుమతి వచ్చిందని, అయితే పొరపాటున ఆ టికెట్ వేరే వారికి చేరిందని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# నేస్తం సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో డెలివరీ పేషెంట్ కు AG రక్తదానం అందించారు..

**మంగపేట (మన దునియా న్యూస్) పిబ్రవరి 21**



మంగపేట మండల కేంద్రంగా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న నేస్తం సేవా ట్రస్ట్ అనేక పేద కుటుంబాలకు ఆర్థిక సహకారంతోపాటు, ప్రమాదంలో ఉన్నవారికి, డెలివరీ పేషెంట్లకు రక్తదాన సేవ కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలలో మంచి మన్ననాలు పొందుతున్న నేస్తం సేవా ట్రస్ట్ వారు శనివారం రోజున డెలివరీ పేషెంట్ కు అత్యవసరంగా ాా+పాజిటివ్ బ్లడ్ కావాలి వాట్సప్ గ్రూపులో వారి కుటుంబ సభ్యులు తెలియజేయగా, అది తెలుసుకున్న నేస్తం సేవ ట్రస్ట్ చైర్మన్ అమీర్ జానంపేట గ్రామానికి చెందిన ఆటో యూనియన్ ప్రెసిడెంట్ అన్నం రమేష్ ద్వారా AG పాజిటివ్ బ్లడ్ను డెలివరీ పేషెంట్ కు అందించారు, వారి కుటుంబ సభ్యులు అమీర్ కు కృతజ్ఞతలు తెలియజేశారు.

# శ్రీశైలం మలన్న హుండీ లెక్కింపు...13 రోజుల్లో కోట్లల్లో...భక్తుల కానుకలు!

**మన దునియా,నంద్యాల జిల్లా: ఫిబ్రవరి 21**



నంద్యాల జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రం శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారి చెంత భక్తులు తమ భక్తిని చాటుకున్నారు. ఇటీవల అత్యంత వైభవంగా జరిగిన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులు పోటెత్తారు. ఈసందర్భంగా స్వామి,అమ్మవార్లకు సమర్పించిన కానుకల లెక్కింపును దేవస్థానం అధికారులు పూర్తి చేశారు. గత 13 రోజులకు గాను మల్లన్నకు భారీగా ఆదాయం లభించింది చంద్రవతి కళ్యాణ మండపంలో కట్టుదిట్టమైన భద్రత, సీసీ కెమెరాల నిఘా మధ్య జరిగిన ఈ లెక్కింపులో స్వామివారికి రూ. 5,61,81,535 ల నగదు ఆదాయం వచ్చినట్లు దేవస్థానం చైర్మన్ రమేష్ నాయుడు, ఈవో శ్రీనివాసరావు అధికారికంగా ప్రకటించారు.నగదుతో పాటు భక్తులు మొక్కుల రూపంలో పెద్ద ఎత్తున బంగారు, వెండి ఆభరణాలను సమర్పించారు. స్వామి అమ్మవార్లకు కానుకగా 124.5 గ్రాముల బంగారం, 5.550 కేజీల వెండి సమకూరాయి. భారతీయ కరెన్సీతో పాటు విదేశాల్లోని భక్తులు కూడా స్వామివారిపై తమ భక్తిని చాటుకున్నారు.హుండీలో 22 అమెరికా డాలర్లు , 25 ఇంగ్లాండ్ పౌండ్లు, 15 ఆస్ట్రేలియా డాలర్లు, సింగపూర్ డాలర్లు, యూరలు తెలిపినారు.

# పెద్దపల్లిలో ఏసీబీ దాడి: లంచం తీసుకుంటూ సబ్ రిజిస్ట్రార్ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబాటు

**మన దునియా,పెద్దపల్లి జిల్లా మంథని:ఫిబ్రవరి 21**



పెద్దపల్లి జిల్లా మంథని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో లంచం వ్యవహారం వెలుగుచూసింది. మంథనిలో సబ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తున్న కాసర్ల రాజేందర్ భూమి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయడానికి ఫిర్యాదుదారుడి వద్ద నుంచి రూ. 16,500 లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి.ఫిర్యాదుదారుడు కొనుగోలు చేసిన భూమి రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన ఫైల్‌ను ముందుకు పంపేందుకు, ఒక ప్రైవేట్ డాక్యుమెంట్ రైటర్ అయిన రషీద్ ద్వారా డబ్బులు తీసుకుంటుండగా అధికారులు రంగంలోకి దిగారు. ముందస్తు సమాచారంతో పన్నాగం రచించిన తెలంగాణ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు కార్యాలయంలో దాడి చేసి, లంచం తీసుకుంటున్న సమయంలోనే రాజేందర్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.ఏసీబీ అధికారులు లంచం మొత్తాన్ని స్వాధీనం చేసుకుని, నిందితుడిపై కేసు నమోదు చేశారు. అనంతరం కార్యాలయ రికార్డులను పరిశీలించి, సంబంధిత పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనతో మంథని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి ఆరోపణలు వెలుగులోకి రావడం ప్రజల్లో ఆగ్రహాన్ని రేకెత్తిస్తోంది. భూముల రిజిస్ట్రేషన్ వంటి సాధారణ ప్రజా సేవలకు కూడా లంచాలు డిమాండ్ చేయడం తీవ్రంగా ఖండించాల్సిన విషయం అని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఈ ఘటనపై పూర్తి స్థాయి దర్యాప్తు కొనసాగుతోందని ఏసీబీ అధికారులు తెలిపారు. సంబంధితులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# వేసవి సెలవుల్లో భక్తులతో కిటకిటలాడనున్న తిరుమల.. వేగంగా దర్శనం కల్పించేందుకు టీటీడీ కొత్త ప్లాన్..

**మన దునియా,తిరుమల:ఫిబ్రవరి 21**



వేసవి సీజన్‌లో తిరుమలకు భక్తుల రద్దీ పెరిగే నేపథ్యంలో టీటీడీ ముందస్తు చర్యలు చేపడుతోంది. వేసవి రద్దీని దృష్టిలో పెట్టుకుని భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపడుతోంది. డేటా ఆధారిత ప్రణాళికతో భక్తులకు మరింత మెరుగ్గా సౌకర్యాలు అందించడంతో పాటుగా దర్శనం కోసం వేచి ఉండే సమయాన్ని తగ్గించేందుకు చర్యలు చేపడుతోంది. సామాన్య భక్తులకు వీలైనంత త్వరగా శ్రీవారి దర్శనం కల్పించేలా చర్యలు తీసుకుంటున్నట్లు టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి తెలిపారు.పరీక్షల కాలం వచ్చేసింది. మరికొన్ని రోజులలో వేసవి సెలవుల సీజన్ మొదలు కానుంది. దీంతో తిరుమల వంటి పుణ్యక్షేత్రాలకు భక్తుల రద్దీ పెరగనుంది. పరీక్షలు పూర్తై సెలవులు రావటంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆలయాలకు క్యూ కడుతుంటారు. ఈ నేపథ్యంలో వేసవి సెలవులలో భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని తిరుమల తిరుపతి దేవస్థానం కీలక నిర్ణయం తీసుకుంది. భక్తులకు వేగంగా దర్శనం కల్పించేందుకు ఇంటిగ్రేటెడ్ ఏఐ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా టెక్నాలజీ సాయం తీసుకోవాలని నిర్ణయం తీసుకుంది. తిరుమలలో వేసవి ఏర్పాట్లపై టీటీడీ ఏఈవో వెంకయ్య చౌదరి శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అధికారులకు పలు సూచనలు చేశారు.రద్దీని దృష్టిలో ఉంచుకుని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు టీటీడీ ఏఈవో వెంకయ్య చౌదరి తెలిపారు. పక్కా ప్రణాళికతో చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. గత రెండు, మూడేళ్ల కాలంలో వేసవి సీజన్‌లో తిరుమల కొండకు ఎంతమంది భక్తులు వచ్చారనే సమాచారాన్ని విశ్లేషించుకుని.. ఈ సీజన్‌లో తిరుమల శ్రీవారి దర్శనాల సంఖ్య, భక్తులు నిరీక్షించే సమయం, తర్వాతి రోజు దర్శనాల కోసం క్యూలైన్లలో ఎంతమంది భక్తులు వేచి ఉంటారనే అంశాలపై చర్చించినట్లు తెలిపారు.భక్తులకు అన్నప్రసాదం, తాగునీరు పంపిణీతో పాటుగా.. నడక దారి భక్తుల కోసం మార్గమధ్యంలో షెడ్ల ఏర్పాటు చేయటం, మాడ వీధులలో కూల్ పెయింటింగ్, షెడ్లు ఏర్పాటు చేయనున్నట్లు వెంకయ్య చౌదరి వెల్లడించారు. వేసవి తాపం నుంచి భక్తులకు ఉపశమనం కల్గించేందుకు మజ్జిగ పంపిణీ పాయింట్ల సంఖ్యను పెంచనున్నట్లు తెలిపారు. సెలవులు కావటంతో భక్తులు కుటుంబాలతో కలిసి శ్రీవారి దర్శనం కోసం వచ్చే అవకాశం ఉందని.. ఈ నేపథ్యంలో వారికి వసతి సదుపాయాలు, అన్నప్రసాదం నిర్వహణ వంటివి మరింత పకడ్బందీ అమలు చేస్తామన్నారు. నడకదారి, అధిక రద్దీ ప్రాంతాల్లో వైద్య సదుపాయాలను బలోపేతం చేస్తామని అన్నారు.తిరుమల శ్రీవారి దర్శనం కోసం సామాన్య భక్తులు వేచి ఉండే సమయాన్ని తగ్గించేలా చర్యలు తీసుకుంటామన్న వెంకయ్య చౌదరి.. ఇంటిగ్రేటెడ్ ఏఐ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా సాంకేతికత వినియోగాన్ని పెంచుతామన్నారు. గంటల వారీగా ఎంతమంది భక్తులు దర్శనానికి వస్తున్నారు, ఎంతమంది దర్శనం పూర్తి చేసుకుని వెళ్తున్నారనే వివరాలను పరిశీలించటంతో పాటుగా, దర్శనం కోసం భక్తులు నిరీక్షించే సమయాన్ని పర్యవేక్షిస్తూతక్షణ నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు. డేటా ఆధారంగా కంపార్ట్మెంట్లు, క్యూ లైన్లలోని భక్తులు వేగంగా దర్శనం పొందేలా చర్యలు చేపట్టనున్నట్లు వివరించారు.

# రెడ్ బుక్ డే బరితెగించిన అమెరికా సామ్రాజ్యవాదం పుస్తక పఠనం,

**మన దునియా (ప్రతినిధి శరత్ )జన్నారం: ఫిబ్రవరి 21,**




జన్నారం మండల కేంద్రంలో రెడ్ బుక్ డే (ఫిబ్రవరి 21) సందర్భంగా బరితెగించిన అమెరికా సామ్రాజ్యవాదం అనే పుస్తకాన్ని అధ్యయనం కార్యక్రమం సిపిఎం కార్యాలయంలో కే బుచ్చన్న అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పైళ్ళ ఆశయ్య మాట్లాడుతూ దేశంలో ప్రపంచంలో ఈరోజు కష్టజీవులకు, కార్మికులకు తమ హక్కులను తెలిపిన రోజు అని అన్నారు. ప్రపంచ కార్మికులారా ఏకంకండి,"పోరాడితే పోయేదేమీ లేదు బానిస సంకెళ్లు తప్ప"అని కారల్ మార్క్స్,'ఫెడరిక్స్ ఎంగేల్స్ లు రచించిన ఈ చిన్న గ్రంథం విశ్వవాప్తంగా మహా సంభాషణలకు నాంది పలికింది. కమ్యూనిస్టు ప్రణాళిక (రెడ్ బుక్ డే) 1848 లండన్ లో ఈ చిన్న పుస్తకం ముద్రించి ప్రపంచవ్యాప్తంగా అనేక ప్రకంపనం అది చేసిన శబ్దం ఖండాల్ని దాటి చరిత్రను కుదిరింపు వేసింది. దాని పేరే కమ్యూనిస్టు ప్రణాళిక ఆ రోజునే మనం రెడ్ బుక్ డే గా గుర్తు చేసుకుంటున్నాము. చరిత్రలో అనేక గ్రంథాలు వెలువడ్డాయి కొన్ని ఆలోచింపజేశాయి మరికొన్ని ఆరాధింపజేశాయి. కానీ కమ్యూనిస్టు ప్రణాళిక మాత్రం ప్రపంచమంతటా ప్రశ్నలు కొడవలై మొలిచింది, ఆస్తి ఎవరి చేతుల్లో ఉంది? శ్రమ ఎవరు చేస్తున్నారు? లాభం ఎవరు పొందుతున్నారు? అనేక రాజ్యాలను కూల్చి కష్టజీవుల సోషలిస్టు రాజ్యాన్ని తెచ్చిన ఈ చిన్న కమ్యూనిస్టు ప్రణాళిక పుస్తకం నేడు ప్రపంచం, దేశంలో కమ్యూనిస్టు శ్రేణులు అభ్యుదయ వాదులు అందరూ కూడా అభ్యసిస్తున్న రోజు కావున నేడు కేంద్రంలో ఉన్నటువంటి మోడీ బిజెపి ప్రభుత్వం అనేక నల్ల చట్టాలు తీసుకొస్తూ రైతుల పైన కార్మికుల పైన పేదల పైన వారాలు మోపుతుందని అందులో భాగమే వీబీజీ రాంజీ పథకం, విద్యుత్ బిల్లు, లేబర్ కోడ్స్, విత్తన బిల్లు అటవీ హక్కుల చట్టాన్ని కాలరాస్తూ అడవులన్నిటిని కార్పొరేట్లకు అప్పజెప్తున్న తరుణంలో రెడ్ బుక్ డే స్ఫూర్తితో సందర్భంగా మరిన్ని ఉద్యమాలకు సన్నతం కావాలని పిలుపునిస్తున్నాము. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కనికరపు అశోక్, జన్నారం మండల కార్యదర్శి కొండగుర్ల లింగన్న, కే బుచ్చన్న,అంబటి లక్ష్మణ్, మగ్గిడి జయ, కోరుట్ల యశోద, వడిపల్లి ప్రమీల, చంద్రయ్య, పర్లా కనకయ్య, దాసన్ల రాజన్న, అత్రం రాజు, తదితరులు పాల్గొన్నారు.

మన దునియా
Our News Our World
RNI Number TELTEL/2023/85680
మన అక్షరం - మన ప్రపంచం



# మున్సిపల్ పాలనలో 'మహిళా' ముసుగు

**గెలిచింది భార్యలైతే.. గండపెండారాలు భర్తలకా?**

**మన దునియా,షాద్‌నగర్:ఫిబ్రవరి 21**

ప్రజాస్వామ్యంలో మహిళలకు సముచిత స్థానం కల్పించాలని, స్థానిక సంస్థల్లో వారికి 50 శాతం రిజర్వేషన్లు కల్పించింది ప్రభుత్వం. ఆశించినట్లుగానే మహిళలు ఎన్నికల్లో పోటీ చేసి, ఘన విజయం సాధించి కౌన్సిలర్లుగా బాధ్యతలు చేపట్టారు. కానీ, షాద్‌నగర్ మున్సిపాలిటీలో ప్రస్తుత పరిణామాలు చూస్తుంటే.. మహిళా సాధికారత అనేది కేవలం కాగితాలకే పరిమితమా? అనే అనుమానం కలగక మానదు.


**సన్మానాల్లో 'వార్' లార్డ్స్ పెత్తనం**

ఇటీవల ముగిసిన మున్సిపల్ ఎన్నికల అనంతరం విజేతలకు సన్మాన కార్యక్రమాలు జోరుగా సాగుతున్నాయి. అయితే, వార్డుల్లో గెలిచిన మహిళా కౌన్సిలర్లను వేదికల మీద నామమాత్రంగా కూర్చోబెట్టి, వారి భర్తలకు భారీగా సన్మానాలు చేయడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. పూలమాలలు, శాలువాలతో భర్తలు మురిసిపోతుంటే, గెలిచిన మహిళా ప్రతినిధులు మాత్రం ప్రేక్షక పాత్రకే పరిమితమవుతున్నారు. ఇది చూస్తున్న సామాన్య ప్రజలు "పదవి భార్యది.. సన్మానం భర్తకా? ఇదేం విడ్డూరం!" అంటూ విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

**రబ్బర్ స్టాంపులుగా మారుతున్నారా?**

గెలిచిన మొదట్లోనే భర్తల ఆధిపత్యం ఇలా ఉంటే, రాబోయే ఐదేళ్ల పాలనలో మహిళల గొంతు కౌన్సిల్ హాల్‌లో వినిపిస్తుందా? అన్నదే అసలు ప్రశ్న. క్షేత్రస్థాయిలో వార్డు పర్యటనల నుంచి అధికారిక చర్చల వరకు భర్తలే చక్రం తిప్పుతున్నారు. ఓట్లు వేసింది మహిళా అభ్యర్థికే అయితే, అధికార దర్పం మాత్రం వారి భర్తలు ప్రదర్శిస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**పాత పద్ధతికి స్వస్తి పలికేది ఎప్పుడు?**



గతంలోనూ ఇలాంటి 'ప్రతినిధి భర్తల' సంస్కృతి ఉండేది. కొత్త పాలకవర్గం వచ్చాకైనా ఈ పద్ధతి మారుతుందని ఓటర్లు ఆశించారు. కానీ, షాద్‌నగర్‌లో మళ్లీ పాత దృశ్యాలే పునరావృతమవుతున్నాయి. పదవిలో ఉన్న మహిళలు తమ బాధ్యతలను స్వయంగా నిర్వహించకుండా, భర్తల నీడలో ఉండటం వల్ల మహిళా రిజర్వేషన్ల ఆశయం దెబ్బతింటోంది. ఈ వింత పోకడలపై సామాజిక కార్యకర్తలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా మహిళా ప్రజాప్రతినిధులు చొరవ చూపి, తమ స్వశక్తితో పాలన సాగించాలని, భర్తల పెత్తనానికి చెక్ పెట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఈ కొత్త పాలకవర్గం మార్పు దిశగా అడుగులు వేస్తుందో లేక 'భర్తల ఆధిపత్యం'లోనే కొనసాగుతుందో వేచి చూడాలి.

# బీజేపీ ఎమ్మెల్యే నివాసంపై దాడి యత్నం ప్రజాస్వామ్యంపై దాడి

**బిజెపి రాష్ట్ర నాయకులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి**

**మన దునియా,షాద్ నగర్: ఫిబ్రవరి 21**

భారతీయ జనతా పార్టీ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి నివాసంపై కాంగ్రెస్ శ్రేణులు దాడికి యత్నించడాన్ని రాష్ట్ర నాయకులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఒక ప్రజాప్రతినిధి ఇంటిపై దాడి చేయడానికి ప్రయత్నించడం అధికార కాంగ్రెస్ అహంకారానికి, దుర్మార్గపు రాజకీయాలకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ప్రజాస్వామ్య స్ఫూర్తిని దెబ్బతీసే విధంగా కాంగ్రెస్ వ్యవహరిస్తోందని, విభిన్న అభిప్రాయాలను సహించలేని స్థితిలో అధికార పక్షం ఉందని విమర్శించారు. వెంకట రమణారెడ్డి విసిరిన సవాల్‌ను స్వీకరించలేక, ఆయన నివాసంపై రౌడీ మూకలను పురమాయించడం కాంగ్రెస్ ప్రతీకార రాజకీయానికి అద్దం పడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కామారెడ్డి లో కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు మరియు రేవంత్ రెడ్డిలను ఓడించడాన్ని జీర్ణించుకోలేక, ఇటీవల జరిగిన మున్సిపాలిటీ ఎన్నికల్లో బీజేపీని ఒంటరిగా ఎదుర్కోలేక కాంగ్రెస్ మరియు భారత్ రాష్ట్ర సమితి కలిసి కక్ష రాజకీయాలకు పాల్పడుతున్నాయని నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి ఆరోపించారు. ప్రజల తీర్పును గౌరవించడం నేర్చుకోవాలని, హింసా రాజకీయాలను తక్షణమే నిలిపివేయాలని రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో బీజేపీ ఎల్లప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు..



# ఉచిత వైద్య శిబిరాలను నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ....

ఈరోజు 126 – జగద్గిరిగుట్ట డివిజన్ రాజీవ్ గృహకల్ప వద్ద గల సంస్కృతి హై స్కూల్ నందు మల్లారెడ్డి హాస్పిటల్ మరియు లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ (నార్త్) సౌజన్యంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... నిరుపేదలు అత్యధికంగా నివసించే జగద్గిరిగుట్ట ప్రాంతంలో ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్న సంస్కృతి హై స్కూల్ యాజమాన్యానికి, మల్లారెడ్డి హాస్పిటల్ డాక్టర్ల బృందానికి, లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ (నార్త్) సభ్యులకు నా అభినందనలు. ఉచిత వైద్య శిబిరాలను నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ గడ్డమీది బాల్ రాజ్, కార్పొరేటర్ జగన్, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, సీనియర్ నాయకులు ఆజం, మెట్ల శ్రీను, త్రివేణి, లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ నార్త్ అధ్యక్షులు బి.ఆంజనేయులు,



చల్లా శ్రీనివాస్ రెడ్డి, వినోద్ జాదవ్, మల్లారెడ్డి హాస్పిటల్ డాక్టర్ల బృంధం తదితరులు సిహెచ్.నరసింహులు, ఎస్. ఆర్. భాషా, పాల్గొన్నారు.

# తొక్కిసలాట కేసు : అల్లు అర్జున్‌పై సాక్ష్యాల్లేవా?

**మన దునియా,హైదరాబాద్: ఫిబ్రవరి 21**

హైదరాబాద్‌లోని సంధ్యా థియేటర్ వద్ద పుష్ప-2 ప్రీమియర్ షో సమయంలో జరిగిన తొక్కిసలాట కేసు దర్యాప్తులో పోలీసులు తీవ్ర విమర్శలను ఎదుర్కొంటున్నారు. పోలీసులు దాఖలు చేసిన చార్జిషీటును కోర్టు వరుసగా మూడోసారి తిరస్కరించింది. నిందితులపై మోపిన అభియోగాలకు సంబంధించి సరైన ఆధారాలు సమర్పించడంలో పోలీసులు విఫలమవుతున్నారని న్యాయస్థానం స్పష్టం చేసింది. అత్యంత సాధారణంగా భావించే ఈ కేసులో కూడా దర్యాప్తు సంస్థ పదే పదే సాంకేతిక పొరపాట్లు చేయడం వెనుక అసలు కారణం ఏమిటనే చర్చ మొదలైంది.

అల్లు అర్జున్ పాత్రపై అస్పష్టత

ఈ కేసులో నటుడు అల్లు అర్జున్‌ను రెండవ నిందితుడిగా చేర్చిన పోలీసులు, ఆయన రాక వల్లే తోపులాట జరిగిందని అభియోగాలు మోపారు. ఒక రోజు అరెస్టు చూపించారు. హైకోర్టు బెయిల్ ఇచ్చింది. అయితే చార్జిషీటులో ఆయన పాత్రను నిర్ధారించే శాస్త్రీయ ఆధారాలను కోర్టుకు సమర్పించలేకపోయారు. నిందితుడి ప్రమేయం వల్లనే మరణం సంభవించిందని నిరూపించడానికి అవసరమైన సాక్ష్యాధారాల అనుసంధానంలో పోలీసులు విఫలమవుతున్నారు. స్పష్టమైన వీడియో ఆధారాలు, ప్రత్యక్ష సాక్ష్యాలు అందుబాటులో ఉన్నా, వాటిని చట్టపరమైన పత్రాలుగా మార్చడంలో పోలీసులు చూపుతున్న ఉదాసీనత అనేక ప్రశ్నలకు తావిస్తోందన్న విమర్శలు వస్తున్నాయి.

చిన్న కేసులో పెద్ద జాప్యం ఎందుకు?

సాధారణంగా ఇలాంటి ప్రమాద ఘటనల్లో నిర్లక్ష్యం ఎవరిదో తేల్చడం పోలీసులకు పెద్ద కష్టం కాదు. కానీ, ఈ కేసులో మాత్రం చార్జిషీటును పక్కాగా రూపొందించడంలో జాప్యం జరుగుతోంది. ప్రాథమిక దర్యాప్తులోనే నిందితులపై నాన్-బెయిలబుల్ సెక్షన్లు విధించిన పోలీసులు, ఇప్పుడు కోర్టు అడిగిన సందేహాలకు సమాధానం ఇవ్వలేక ఇబ్బంది పడుతున్నారు. ఈ నిర్లక్ష్యం వల్ల కేసు నీరుగారిపోయే ప్రమాదం ఉంది. ప్రముఖ వ్యక్తులు నిందితులుగా ఉన్నందువల్లే దర్యాప్తును ఉద్దేశపూర్వకంగానే ఆలస్యం చేస్తున్నారా లేదా పోలీసుల వద్ద బలమైన ఆధారాలే లేవా అన్నది ఇప్పుడు మిస్టరీగా మారింది.

నిందితులపై మోపిన సెక్షన్లకే ఎసరు?

సెక్షన్ 106(1) వంటి తీవ్రమైన అభియోగాలు మోపినప్పుడు, పోలీసులు అంతే స్థాయి తీవ్రతతో ఆధారాలను కోర్టు ముందు ఉంచాలి. కానీ చార్జిషీటులో పేర్కొన్న అంశాలకు, అందించిన సాక్ష్యాలకు పొంతన లేకపోవడంతో కోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తోంది. పదే పదే చార్జిషీటు వెనక్కి రావడం పోలీసు వ్యవస్థ విశ్వసనీయతను దెబ్బతీస్తోంది. తదుపరి విచారణలోనైనా పోలీసులు పక్కా ఆధారాలతో చార్జిషీటును సరిచేసి దాఖలు చేస్తారా లేక కేసును కోల్డ్ స్టోరేజ్‌లో పెట్టేస్తారా అన్నది వేచి చూడాల్సిందే.

# అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం



ఐక్యరాజ్యసమితి ప్రధాన విభాగం యునెస్కో 1999 లో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ప్రకటించింది. నాటి పాకిస్థాన్ లో బెంగాలీలు 1952లో తమ మాతృభాష బెంగాలీ పరిరక్షణ కోసం చేసిన పోరాటానికి గుర్తుగా బంగ్లాదేశ్ ప్రతిపాదన మేరకు ఈ తేదీ ఖరారైంది. యునెస్కో విద్యాబోధనలో కనీసం మూడు భాషలు.. మాతృభాష, జాతీయ భాష, అంతర్జాతీయ భాష.. లకు చోటుండాలని 1999 నుంచి ప్రచారం చేయడం ఆరంభించింది. పిల్లలు పసిప్రాయంలో మాతృభాష తరువాత మిగిలిన రెండు భాషలు నేర్చుకుంటే వారి జీవితం సాఫీగా సాగిపోతుందని పై ప్రతిపాదన చేసింది. చిన్న పిల్లల మానసిక ఆరోగ్యానికి వారి మాతృభాషతో సంబంధం ఉందని పరిశోధకులు తేల్చారు. పుట్టిన దగ్గర్నుంచి మాతృభాష ధ్వనులు వింటుండటం వల్ల వారిపై ప్రభావం చూపుతాయి. మాతృభాషలో మాట్లాడలేని పిల్లల్లో చురుకుదనం తక్కువగా ఉంటుందని మానసిక నిపుణులు చెబుతున్నారు. అమ్మపాలు, అమ్మభాష లకు ఏవీ సాటిరావు. ఎదుగుదలకు అభివృద్ధికి మాతృభాష ఎంతగానో తోడ్పడుతుంది. గ్లోబలైజేషన్ నేపథ్యంలో కొన్ని భాషలకే అధిక ప్రాధాన్యం లభిస్తుతటం వలన రాబోయే కాలంలో వందలాది భాషల ఉనికి అంతరించిపోయే ప్రమాదం కనబడుతోంది. గనుక మనందరం మన మాతృభాష ఉనికిని మనం కాపాడుకోవాలి. మన భాషా సంస్కృతి వారసత్వాన్ని నిలబెట్టుకునేందుకు మనలో ప్రతీ ఒక్కరూ కృషి చేయాలి. మన మాతృభాషను మరచిపోతే మన కన్నతల్లిని మరచినట్లే. ఈరోజుల్లో ఉద్యోగ వ్యాపారాల నిమిత్తం ఇతర రాష్ట్రాలలో, విదేశాల్లో స్థిరపడిపోతున్నారు. పిల్లలు తమ మాతృభాషకు దూరమవుతున్నారు. మనమే మన పిల్లలకు చిన్నతనం నుంచే మన మాతృభాష మాధుర్యం మమకారం వారికి చెబుతుండాలి.. రాయడం చదవడం నేర్పించాలి. ఆధునిక నాగరికత మోజులో పడిపోయి మన మాతృభాషను నిర్లక్ష్యం చేయడం తగదు. యునెస్కో కూడా ఇదే సూచిస్తోంది. మన మాతృభాషను కాపాడుకోవలసిన బాధ్యత మనదే. అందరికీ అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం శుభాకాంక్షలు..

మన దునియా
Our News Our World
RNI Number TELTEL/2023/85680
మన అక్షరం - మన ప్రపంచం

# షుగర్ ఫ్రీ స్నాక్స్ ఆరోగ్యానికి మంచిదా?

కాలం మారుతున్న కొద్దీ మనం తినే ఆహారంలో కూడా విషపూరిత అంశాలు చేరిపోతున్నాయి. మనం రోజూ తినే ఆహారమే నేడు మనిషి ఎదుర్కొంటున్న అనేక వ్యాధులకు కారణం. మొదట్లో, చెడుకు బానిసలుగా ఉన్నవారు మాత్రమే అనారోగ్యానికి గురవుతారు. అయితే ఇప్పుడు మనం తినే ఆహారంలో కాస్త మార్పు వచ్చినా గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వచ్చే అవకాశాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఈ మధ్య కాలంలో షుగర్, స్థూలకాయం, క్యాన్సర్ వంటి సమస్యలు పంచదారతో కూడిన ఆహారం తీసుకోవడం వల్ల వస్తాయని చెప్పారు. అందువల్ల, చాలా మంది ప్రజలు చక్కెర ఆహారాలకు దూరంగా ఉండటం , చక్కెర లేని ఉత్పత్తులను తీసుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలిని గడుపుతున్నారని అనుకుంటారు. అయితే మనం అనుకున్నట్లుగా చక్కెర రహిత ఉత్పత్తులు నిజంగా ఆరోగ్యానికి మంచివేనా? దీని గురించి నిపుణులు ఏమంటారు? పేరు సూచించినట్లుగా, చక్కెరను ఉపయోగించకుండా చక్కెర రహిత ఉత్పత్తులు తయారు చేయబడతాయి . కానీ తీపి రుచిని అందించడానికి తక్కువ కేలరీలతో ప్రత్యామ్నాయ స్వీటెనర్లను ఉపయోగిస్తారు. అస్పర్టమే సాధారణంగా అటువంటి చక్కెర రహిత ఉత్పత్తులలో ఉపయోగిస్తారు. వీటిని సాధారణంగా చూయింగ్ గమ్ , బేకింగ్ సోడాలో ఉపయోగిస్తారు. అస్పర్టమే కాకుండా, సాచరిన్ , సుక్రలోజ్ కూడా సాధారణంగా చక్కెర రహిత ఉత్పత్తులలో కనిపిస్తాయి. ఇప్పుడు మన ముందున్న ప్రశ్న ఏమిటంటే, చక్కెరను ఉపయోగించకుండా తయారు చేసే ఈ షుగర్ ఫ్రీ ఉత్పత్తుల వినియోగం నిజంగా ఆరోగ్యానికి మంచిదేనా, పోషకాహార నిపుణుడు అమిత గాద్రే ప్రకారం, చక్కెర కంటెంట్ వినియోగంతో పోలిస్తే చక్కెర లేని స్వీట్లు తీసుకోవడం ఆరోగ్యానికి మంచిదే. ఉత్పత్తులు. కానీ షుగర్ లేదనే కారణంతో ఎక్కువగా తినడం ప్రారంభిస్తే సమస్యలు వస్తాయి. పండుగల సమయంలో తరచుగా భోజనం చేయడంలో తప్పులేదు. ప్రతిరోజూ షుగర్ ఫ్రీ ఉత్పత్తులను తీసుకోవడం ఖచ్చితంగా మంచిది కాదు. షుగర్ ఫ్రీ క్యాండీలలో కూడా మీరు జాగ్రత్తగా ఉండాలి, ఎందుకంటే వాటిలో మీ క్యాలరీలను పెంచే ఇతర పదార్థాలు ఉంటాయి. అమిత ప్రకారం, మీరు వారానికి ఒకసారి చక్కెర లేని ఉత్పత్తిని తీసుకోవచ్చు. మిఠాయిల కోసం మార్కెట్లకు వెళ్లినప్పుడు రెండు రకాల స్వీట్లు దొరుకుతాయి. ఒకదానిలో షుగర్ వాడలేదని రాసి ఉండగా, మరో దానిలో షుగర్ ఫ్రీ అని రాసి ఉంది. మంచి ఆరోగ్యం విషయంలో దేన్ని ఎంచుకోవాలి అనే విషయంలో వినియోగదారులుగా మనం అయోమయం చెందడం సర్వసాధారణం. అయితే రెంటికి ఏమైనా తేడా ఉందా? లేక వీరిద్దరూ మిఠాయిల కోవకు చెందినవారే అనే సందేహం రావడం సహజం. వారు చక్కెరను ఉపయోగించరు లేదా చక్కెర రహితంగా లేబుల్ చేయబడిన ఉత్పత్తులలో చక్కెరకు ప్రత్యామ్నాయంగా ఏ ఇతర ఉత్పత్తిని ఉపయోగించరు. కానీ ఆ మిఠాయిని తయారు చేయడానికి ఉపయోగించే ఇతర పదార్థాలు తీపి భాగం కలిగి ఉండవచ్చు. కానీ షుగర్ ఫ్రీ ఉత్పత్తులలో చక్కెర ఉండదు. బదులుగా, అస్పర్టమే, సాచరిన్ , సుక్రలోజ్ వంటి పైన పేర్కొన్న పదార్థాలు ఉపయోగించబడతాయి. వీటిలో ఏది తినాలనేది మన ఇష్టం.




## ఉద్యోగులు చేయి, మణికట్టు నొప్పితో ఎందుకు బాధపడుతున్నారు..?



నిరంతరం కంప్యూటర్ ముందు కూర్చునే వృత్తి నిపుణులు పని చేయడం సహజం. రోజులో ఎక్కువ భాగం పనికి కేటాయించడం అనేది కొంత మందిలో ఏదో ఒక అవసరం , ఆధునిక జీవనశైలి వలె దీనిని నివారించలేము అనేది కూడా వాస్తవం. చాలా మంది పని నిపుణులు పనిలో ఎక్కువ గంటలు గడపడం వంటి అనేక కారణాల వల్ల వేళ్లు, మణికట్టు, మోచేతులు , చేతుల్లో తీవ్రమైన నొప్పిని అనుభవిస్తారు. ఈ నొప్పిని తనిఖీ చేయకపోతే, ఇది దీర్ఘకాలిక చలనశీలత సమస్యలకు దారి తీస్తుంది. మీరు చేయగలిగే అనేక చేతి వ్యాయామాలు ఉన్నాయి, దీని కోసం డాక్టర్ లేదా ఫిజియోథెరపిస్ట్ మీకు మార్గనిర్దేశం చేయవచ్చు. ఆఫీసుకు వెళ్లేవారిలో చేయి నొప్పికి ఆరు సాధారణ కారణాల గురించి తెలుసుకుందాం. కంప్యూటర్‌ను ఉపయోగిస్తున్నప్పుడు టైపింగ్, మౌస్ ఉపయోగించడం, చేతిని నిరంతరం ఎత్తడం వంటి పునరావృత కదలికలు తరచుగా జరుగుతాయి, ఇది కండరాలు, స్నాయువులు , నరాలలో మంట , మైక్రోట్రామాకు దారితీస్తుంది. ఇది సాధారణంగా మణికట్టు, మోచేతులు , భుజాలను ప్రభావితం చేస్తుంది. కీబోర్డ్ , మౌస్ ఎక్కువసేపు ఉపయోగించడం వల్ల తరచుగా చేతులు , మణికట్టులో నొప్పి వస్తుంది. కొన్నిసార్లు తప్పు టైపింగ్ టెక్నిక్ లేదా గ్రిప్ ఉపయోగించే అవకాశాలు ఉన్నాయి. ఇందుకోసం మధ్యమధ్యలో చిన్నపాటి విరామాలు తీసుకోవడం, చేతులు, చేతులు, భుజాలను సాగదీయడం వంటి సాధారణ వ్యాయామాలు చేయవచ్చు. మీ కుర్చీ చాలా ఎత్తుగా లేదా చాలా తక్కువగా ఉంటే లేదా మీ డెస్క్ , మానిటర్ సరిగ్గా సర్దుబాటు చేయకపోతే, అది మీ మెడ, భుజాలు , చేతుల్లో ఒత్తిడిని కలిగిస్తుంది . ఈ నొప్పి మీ మణికట్టును ప్రభావితం చేసే కార్పల్ టన్నెల్ సిండ్రోమ్ , స్నాయువుల వాపు వంటి టెండినిటిస్ వంటి సమస్యలను కలిగిస్తుంది. మీకు సరిపోయేలా కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకోవడం ఈ సమస్యలను నివారించడంలో సహాయపడుతుంది. మీరు విరామం లేకుండా చాలా గంటలు పని చేస్తున్నారని గమనించండి. వ్యాయామం లేకపోవడం లేదా శారీరక శ్రమ లేకపోవడంతో పాటు పెరిగిన పని , ఒత్తిడి తీవ్రమైన నొప్పికి దారి తీస్తుంది. టెన్నిస్ ఎల్బో లేదా గోల్ఫర్స్ ఎల్బో వంటి టెండినిటిస్ (కండరాల వాపు) వంటి పరిస్థితులను నిర్ధారించడానికి మీ వైద్యుడికి వైద్య పరీక్ష సహాయపడుతుంది , ఇవి మోచేయిని ప్రభావితం చేసే సాధారణ సమస్యలు. ముఖ్యంగా పునరావృత కార్యకలాపాలు చేసే వ్యక్తులలో ఈ నొప్పులు సర్వసాధారణం. అలాంటి నొప్పి లేదా అసౌకర్యం ఉంటే, వైద్యుడిని చూడటం మంచిది. ఒక వ్యక్తి పేలవమైన , నిష్క్రియాత్మక జీవనశైలిని నడిపించినప్పుడు , శారీరక శ్రమలకు తక్కువ సమయం ఇచ్చినప్పుడు, వారు కండరాల నొప్పి సమస్యను అభివృద్ధి చేయవచ్చు. అదనంగా, ధూమపానం లేదా ఊబకాయం , మునుపటి గాయాలు లేదా మధుమేహం , ఆర్థరైటిస్ వంటి సమస్యలను కలిగి ఉన్న వ్యక్తులు చేతులు , చేతుల్లో నొప్పిని కలిగి ఉంటారు. దీని కోసం, క్రమం తప్పకుండా స్ట్రెచింగ్ వ్యాయామాలు చేయండి , మీ పని స్థలాన్ని మీకు సౌకర్యవంతంగా ఉంచండి. క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు కూడా చేయించుకోండి.

# తిప్పతీగ ఆకు తింటే తిప్పలన్నీ మాయం..



తిప్పతీగ ఆయుర్వేదంలో చాలా పురాతనమైన ఔషధ మొక్క. దీని ఆకులు, కాండం రెండూ అనేక ఆరోగ్య సమస్యలకు మంచి ఔషధంగా పనిచేస్తాయి. ఈ మొక్కలో పోషకాలు, యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు పుష్కలంగా ఉన్నాయి.ఇది రోగనిరోధక శక్తిని పెంచుతుంది. అనేక వ్యాధులను తగ్గించడంలో సహాయపడుతుంది.1. ఎముకలు: తిప్ప తీగను ప్రధానంగా ఎముకల బలహీనత, విరుగుడు గాయాలు (ఫ్రాక్చర్) సందర్భాలలో ఉపయోగిస్తారు. ఇది ఎముక కణాలను పునరుత్పత్తి చేస్తుంది. విరిగిన ఎముకలు మళ్లీ త్వరగా కుదించడానికి సహాయపడుతుంది. ఇందులో కాల్షియం, ఫాస్పరస్ వంటి ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. ఇది ఎముకల కండరాలను బలపరుస్తుంది.2. జీర్ణక్రియ: తిప్ప తీగ ఆకులను జీర్ణ సమస్యలకు ఆయుర్వేద వైద్యంలో విరివిగా ఉపయోగిస్తారు. ఇది అజీర్ణం, గ్యాస్, కడుపు ఉబ్బరం, మలబద్ధకం వంటి సమస్యలను తగ్గిస్తుంది. ఇందులోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తాయి. తిప్ప తీగ ఆకుల ముద్దను తింటే జీర్ణక్రియ మెరుగు పడుతుంది.3. బరువు తగ్గడం: బచ్చలి కూరను బరువు తగ్గించే ప్రక్రియలో కూడా ఉపయోగిస్తారు. ఈ మొక్కలో ఉండే కాంపౌండ్స్ కొవ్వును కరిగించి శరీరంలో కొవ్వు నిల్వలను తగ్గిస్తాయి. ఇది శరీరంలో జీవక్రియను పెంచుతుంది. తద్వారా క్యాలరీలు తక్కువగా ఉండటం వల్ల బరువు తగ్గాలనుకునే వారికి ఇది సహాయపడుతుంది. 4. చక్కెర నియంత్రణ: తిప్పతీగ ఆకులు రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడతాయి. మధుమేహం ఉన్నవారికి ఇది ప్రధానంగా ఉపయోగపడుతుంది. ఈ మొక్కలోని రసాయనాలు ఇన్సులిన్ ఉత్పత్తిని ప్రోత్సహిస్తాయి. రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను స్థిరంగా ఉంచుతాయి. అందువలన, ఇది మధుమేహం ప్రభావాన్ని తగ్గిస్తుంది. 5. కీళ్లనొప్పులు: తిప్ప తీగలోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు కీళ్ల నొప్పులను తగ్గిస్తాయి. కీళ్లనొప్పులు వంటి వ్యాధుల నివారణలో ఈ మొక్కను ఉపయోగించడం వల్ల శరీరంలోని కీళ్లలో మంట మరియు నొప్పులు తగ్గుతాయి. జాయింట్ సెన్సిటివిటీని తగ్గించడం ద్వారా జాయింట్ ఫ్లెక్సిబిలిటీని మెరుగుపరుస్తుంది. 6. చర్మ సమస్యలు: తిప్ప తీగ ఆకులు చర్మ సమస్యలకు ఉపయోగపడతాయి. ఇందులోని క్రిమినా శక లక్షణాలు కోతలు, కాలిన గాయాలు, చర్మ ఇన్ఫెక్షన్ల వంటి చర్మ సమస్యలను నివారిస్తాయి. ఆకును రసాన్ని తీసుకుని చర్మానికి రాసుకుంటే చర్మంపై జిడ్డు, మొటిమలు తగ్గుతాయి.

## ఈ టీలు తాగితే చాలు.. బెల్లీ ఫ్యాట్ కరిగిపోవడం ఖాయం!



ప్రస్తుత రోజుల్లో స్త్రీ పురుషులు చాలామంది అధిక బరువు బెల్లీ ఫ్యాట్ సమస్యతో ఇబ్బంది పడుతున్న విషయం తెలిసిందే. వీటి కారణంగా చాలామంది వారి సొంత పనులు చేసుకోవడానికి కూడా ఇబ్బంది పడుతూ ఉంటారు.కొన్ని కొన్ని సార్లు ఈ బెల్లీ ఫ్యాట్ కారణంగా బాడీ షేమింగ్ కామెంట్స్ ని కూడా ఎదుర్కోవాల్సి వస్తూ ఉంటుంది. అయితే ఈ బెల్లీ ఫ్యాట్ ని కరిగించుకోవడం కోసం కొన్ని రకాల టీలు బాగా ఉపయోగపడతాయి అని చెబుతున్నారు. ఇంతకీ ఆ టీ లు ఏవి అన్న విషయానికి వస్తే.. బరువు తగ్గడానికి ఉపయోగించే టీలను స్లిమ్మింగ్ టీలు అని పిలుస్తారు. ఈ స్లిమ్మింగ్ టీకి దాని ప్రభావాన్ని అందించే రెండు ప్రాథమిక పదార్థాలు కెఫిన్ , పాలీఫెనాల్స్. అదనపు ట్రైగ్లిజరైడ్‌లను కరిగించే నిర్దిష్ట ఎంజైమ్‌ను ప్రేరేపించడం ద్వారా, పాలీఫెనాల్స్ భాగం శరీరంలో అధిక ట్రైగ్లిజరైడ్ ఏర్పడే ప్రమాదాన్ని తొలగిస్తుందట. అలాగే శరీరంలో కొవ్వును సైతం కరిగిస్తుందని చెబుతున్నారు. కాగా స్లిమ్మింగ్ టీ తాగడం వల్ల జీవక్రియ రేటును పెంచడంలో సహాయపడుతుందట. ఇది శరీరంలో కొవ్వును చాలా తొందరగా కరిగిస్తుందని, ఇది వినియోగించే కేలరీల పరిమాణాన్ని కూడా తగ్గిస్తుందని చెబుతున్నారు. కార్బోహైడ్రేట్లు, చక్కెరలను కొవ్వుగా మార్చకుండా శరీరాన్ని నిరోధిస్తుందట. ఇది శరీరంలో ని కొవ్వు పరిమాణాన్ని తగ్గిస్తుందని, మీరు బరువు తగ్గడానికి కొన్ని సులభమైన కార్యకలాపాలతో స్లిమ్మింగ్ టీని కూడా తాగేస్తే, సులభంగా బరువు తగ్గవచ్చని చెబుతున్నారు వైద్యులు. బయట మార్కెట్లో మనకు అనేక రకాల స్లిమ్మింగ్ టీలు అందుబాటులో ఉన్నాయి. వాటిని తాగడం వల్ల ఈజీగా మీరు అధిక బరువుతో పాటు బెల్లీ ఫ్యాట్ ని కూడా కరిగించుకోవచ్చు.

## ఈ ఫేస్ ప్యాక్ ట్రై చేస్తే చాలు.. నిముషాల్లో స్కిన్ మెరిసిపోవాల్సిందే!

చాలామంది స్త్రీ పురుషులు అందంగా కనిపించడం కోసం వేలకు వేలు డబ్బులు ఖర్చు చేస్తూ ఉంటారు. బ్యూటీ పార్లర్ల చుట్టూ తిరుగుతూ, రకరకాల బ్యూటీ ప్రోడక్టులు ఉపయోగిస్తూ ఉంటారు. ఇంకొందరు సహజంగా కనిపించే అందం కోసం ప్రయత్నిస్తూ ఉంటారు. కొందరు ఫంక్షన్ల కోసం నిమిషాల్లోనే మెరిసిపోయే స్కిన్ కావాలని కోరుకుంటూ ఉంటారు. మరి అలాంటి వాళ్ళు ఎటువంటి ఫేస్ ప్యాక్ ట్రై చేయాలో ఇప్పుడు మనం తెలుసుకుందాం.. అందులో మొదటిది శనగపిండి, పసుపు ఫేస్ ప్యాక్ కూడా ఒకటి. ఈ ప్యాక్ చేయడానికి మీరు రెండు టేబుల్ స్పూన్ల శెనగపిండి, ఒక టీస్పూన్ పసుపు పొడిని కలపాలి. పేస్ట్ చేయడానికి పాలు లేదా రోజ్ వాటర్ ఉపయోగించవచ్చు. దీన్ని మీ ముఖానికి అప్లై చేసి 20 నిమిషాల పాటు అలాగే ఉంచాలి. తర్వాత శు భ్రం చేస్తే సరిపోతుందట. మరొక రెమిడీ విషయానికి వస్తే.. బంగాళదుంప అలోవెరా, శెనగపిండి ఫేస్ ప్యాక్.. అయితే ఈ ప్యాక్ చేయడానికి బంగాళదుంప గుజ్జు, అలోవెరా జెల్ , రెండు టేబుల్ స్పూన్ల శెనగపిండిని కలపాలి. మీరు పేస్ట్ చేయడానికి నీటిని ఉపయోగించవచ్చు. ఈ ఇన్ ఫేస్ ప్యాక్‌ని అప్లై చేసి, మీ చర్మంపై 10 నిమిషాల పాటు ఉంచి, తర్వాత శుభ్రం చేయవచ్చని చెబుతున్నారు. మరో ఫేస్ ప్యాక్ విషయానికి వస్తే.. నిమ్మకాయ టమాటో ఫేస్ ప్యాక్ తో ఇన్స్టాంట్ అందాన్ని పొందవచ్చు అని చెబుతున్నారు. మరి ఈ మిశ్రమాన్ని ఎలా తయారు చేసుకోవాలి అన్న విషయానికి వస్తే.. ఈ ప్యాక్ కోసం, టొమాటో గుజ్జును తీసుకొని, ఒక టీస్పూన్ నిమ్మరసం జోడించాలి. అలా అప్లై చేసి 15 నిమిషాల పాటు అలాగే ఉంచి ఆ తర్వాత ముఖం శుభ్రం చేసుకోవాలి. మెరిసే చర్మం సొంతం కావాలి అనుకున్న వారు కాఫీ పాలు ప్యాక్ ట్రై చేస్తే చాలు. అందుకోసం ఈ రెండు పదార్థాలను 2:1 నిష్పత్తిలో కలిపి, మీ ముఖం మీద అప్లై చేయాలి. పాలలోని లక్షణాలు మీ చర్మానికి స్థితిస్థాపకతను నిర్ధారిస్తాయి. ఇది ముఖంపై ముడతలను తగ్గించడంతో పాటు, ముఖం మెరిసిపోయేలా చేయడంలో సహాయపడుతుందని చెబుతున్నారు.



## అందం కోసం విలువైన రహస్యం పటిక

పటిక అనేది బహుముఖ సహజ నివారణ. పటికను మీరు సాధారణంగా కొన్ని షాపుల్లో చూసే ఉంటారు. ఈ పటికలో క్రిమి సంహారక గుణాలు కలిగి ఉండడంతో, గాయాలైనప్పుడు రక్తం కారిపోకుండా పటిక కాపాడగలదు. ఇందులోని పొటాషియం, అల్యూమినియం, సల్ఫేట్ అనే రసాయన పదార్థాలు మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూరిస్తాయి. ఇది జుట్టును శుభ్రపరచడంలో, శరీరంపై ముడుతలకు చికిత్స చేయడంలో, చెమటను నియంత్రించడంలో, చిగుళ్ల రక్తస్రావం నుండి ఉపశమనం పొందడంలో ఇంకా మూత్ర ఇన్ఫెక్షన్ల నుండి రక్షించడంలో సహాయపడుతుంది. పటికను దంతాలను శుభ్రపరచడానికి మరియు చిగుళ్ళను బలోపేతం చేయడానికి ఉపయోగిస్తారు. ఇది పంటి నొప్పిని కూడా తగ్గిస్తుంది. పటికను దంతాలను శుభ్రపరచడానికి, చిగుళ్ళను బలోపేతం చేయడానికి ఉపయోగిస్తారు. ఇది పంటి నొప్పిని కూడా తగ్గిస్తుంది. పటికలో యాంటీ బాక్టీరియల్ లక్షణాలు ఉంటాయి. ఇది చర్మంపై ఇన్ఫెక్షన్లను నివారిస్తుంది. పటిక నీటితో జుట్టు కడగడం వల్ల తలపై ఉన్న జుట్టులో ఉండే మురికి, పేలు వంటి తొలిగిపోతాయి. పటికను రాత్రంతా నీటిలో నానబెట్టి, ఉదయం మీ జుట్టును కడగాలి. యూరిన్ ఇన్ఫెక్షన్ నుండి ఉపశమనం కలిగించేందుకు ప్రైవేట్ పార్ట్ లను శుభ్రం చేయడానికి పటిక నీరు ఉపయోగపడుతుంది.



పటిక పొడి శరీరంలో వాపు, నొప్పిని తగ్గించడంలో ఉపయోగపడుతుంది. ప్రభావిత ప్రాంతంపై దీన్ని పూయడం మంచిది. పటిక నీటిని ముఖానికి పట్టించడం వల్ల ముడతలు తగ్గుతాయి. రెగ్యులర్ గా ఉపయోగించడం వల్ల చర్మం బిగుతుగా, కాంతివంతంగా మారుతుంది. పటిక చెమట వాసనను తగ్గించడంలో సహాయపడుతుంది. పటిక నీటితో స్నానం చేయడం వల్ల చెమట సమస్య తగ్గుతుంది. పటిక నీటితో పుక్కిలించడం చిగుళ్ల నుండి రక్తస్రావం నుండి ఉపశమనం కలిగిస్తుంది. నోటి దుర్వాసనను కూడా తగ్గిస్తుంది.

మన దునియా
Our News Our World
RNI Number TELTEL/2023/85680
మన అక్షరం - మన ప్రపంచం



# అమ్మాయిల కొత్త చరిత్ర




## మందన, రోడ్రిగ్స్ విజృంభణ ఆసీస్‌పై భారత్ తొలిసారి టీ20 సిరీస్ కైవసం

అడిలైడ్: భారత మహిళల జట్టు కొత్త చరిత్ర లిఖించింది. ఇన్నాళ్లు అందని ద్రాక్షగా మారిన ఆస్ట్రేలియా గడ్డపై ద్వైపాక్షిక సిరీస్ విజయాన్ని ఖాతాలో వేసుకుంది. సమష్టి ప్రదర్శనతో సత్తాచాటుతూ సరిగ్గా దశాబ్దం తర్వాత తొలిసారి టీ20 సిరీస్‌ను దక్కించుకుని ఔరా అనిపించుకుంది. ఓవరాల్‌గా కంగారూలపై రెండో సిరీస్ కైవసం చేసుకుని కొత్త అంకాన్ని లిఖించింది. శనివారం జరిగిన నిర్ణయాత్మక మూడో టీ20 పోరులో టీమ్‌ఇండియా 17 పరుగుల తేడాతో ఆసీస్‌పై చారిత్రక విజయం సాధించింది.తొలుత స్మృతి మందన(55 బంతుల్లో 82, 8ఫోర్లు, 3సిక్సలు) ధనాధన్ ఇన్నింగ్స్‌కు తోడు జెమీమా రోడ్రిగ్స్(46 బంతుల్లో 59, 4ఫోర్లు) అర్ధసెంచరీతో భారత్ 20 ఓవర్లలో 176/6 భారీ స్కోరు నమోదు చేసింది. 19 పరుగులకే ఓపెనర్ షెఫాలీవర్మ(7) వికెట్ కోల్పోయిన భారత్‌ను మందన, రోడ్రిగ్స్ ఆదుకున్నారు. ఆసీస్ బౌలింగ్‌ను దీటుగా నిలువరిస్తూ స్కోరుబోర్డుకు కీలక పరుగులు జతచేశారు. సూపర్‌ఫామ్‌మీదున్న వీరిద్దరు బౌండరీలే లక్ష్యంగా చెలరేగడంతో కంగారూ బౌలర్లు చేష్టలుడిగిపోయారు. మందన, రోడ్రిగ్స్ కలిసి రెండో వికెట్‌కు 121 పరుగుల రికార్డు భాగస్వామ్యాన్ని నెలకొల్పారు.సదర్లాండ్ బౌలింగ్‌లో మందన ఔట్ కావడంతో వీరి జోరుకు బ్రేక్ పడింది. క్రీజులో ఉన్నంతసేపు రీచా ఘోష్(7 బంతుల్లో 18, 2ఫోర్లు, సిక్స్) దూకుడుగా ఆడింది. రోడ్రిగ్స్, అమన్‌జ్యోత్(1), దీప్తిశర్మ(1) వెంటవెంటనే ఔటయ్యారు. సదర్లాండ్(2/34) రెండు వికెట్లు తీసింది. లక్ష్యఛేదనలో ఆసీస్ 20 ఓవర్లలో 159/9 స్కోరుకు పరిమితమైంది. శ్రేయాంక పాటిల్(3/22), శ్రీచరణి (3/32), అరుంధతిరెడ్డి(2/35) ధాటికి ఆసీస్ బ్యాటర్లు వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయారు. ఆశ్లే గార్డ్‌నర్(57) మినహా ఎవరూ చెప్పుకోదగ్గ స్కోర్లు చేయలేదు. జార్జియా వోల్(10), మూనీ(6), ఎలీస్ పెర్రీ(1), వేర్‌హామ్(12), సదర్లాండ్(14) స్వల్ప స్కోర్లకు పరిమితమయ్యారు. మందనకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'తో పాటు సిరీస్ దక్కింది. ఇరు జట్ల మధ్య వన్డే సిరీస్ ఈనెల 24 నుంచి మొదలుకానుంది.

# సఫారీలతో సై నేడు భారత్‌తో సూపర్-8 పోరు

**టీ20 ప్రపంచకప్ టోర్నీ**

అహ్మదాబాద్: ప్రతిష్టాత్మక టీ20 ప్రపంచకప్‌లో భారత్ మరో కీలక పోరుకు సిద్ధమైంది. ఆదివారం మొతెరా స్టేడియం వేదికగా టీమ్‌ఇండియా, దక్షిణాఫ్రికా మధ్య సూపర్-8 మ్యాచ్ జరుగనుంది. గ్రూపు దశలో ఓటమి ఎరుగని ఇరు జట్లు అమీతుమీ తేల్చుకునేందుకు సై అంటున్నాయి. మెగాటోర్నీలో టైటిల్ ఫేవరేట్లలో ముందంజలో ఉన్న భారత్, దక్షిణాఫ్రికా సమవుజ్జీలుగా బరిలోకి దిగుతున్నాయి. గత ఎడిషన్‌లో ఫైనల్లో తమకు ఎదురైన ఓటమికి దీటైన ప్రతీకారం కోసం సఫారీలు కసిమీదుంటే పొట్టి ఫార్మాట్‌లో టీమ్‌ఇండియా ఎదురన్నదే లేకుండా దూసుకెళుతున్నది.దీనికి తోడు కొట్టిన పిండిలాంటి సొంత ఇలాఖాలో జరుగుతున్న మెగాటోర్నీలో కచ్చితంగా కప్ కొట్టాలన్న పట్టుదలతో ఉన్న సూర్యకుమార్‌యాదవ్ నేతృత్వంలోని భారత్ అందుకు తగ్గట్లు పావులు కదుపుతున్నది. అమెరికాతో తొలి మ్యాచ్ నుంచి మొదలుపెడితే నమీబియా, పాకిస్థాన్, నెదర్లాండ్స్‌తో ప్రతీ మ్యాచ్‌లో మనోళ్లు సమష్టి ప్రదర్శన కనబరిచారు. టాపార్డర్ నిలకడలేమి ప్రదర్శిస్తున్నా మిడిలార్డర్, లోయార్డర్ బ్యాటింగ్‌తో పోరాడే స్కోర్లు సాధ్యమవుతున్నాయి. బుమ్రా, అర్ష్‌దీప్‌సింగ్, హార్దిక్ పేస్ దళాన్ని ముందుకు నడిపిస్తుంటే..వరుణ్ చక్రవర్తి, అక్షర్‌పటేల్, కుల్దీప్‌యాదవ్ పరిస్థితులకు తగ్గట్లు ప్రత్యర్థులకు చెక్ పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. మరోవైపు సమతూకంగా కనిపిస్తున్న దక్షిణాఫ్రికాను కూడా తక్కువ అంచనా వేసేందుకు భారత్ ప్రయత్నించకపోవచ్చు.గ్రూపు దశలో సఫారీలు అహ్మదాబాద్‌లోనే మూడు మ్యాచ్‌లు ఆడటం వారికి కలిసొచ్చే అంశం కానుంది. బ్యాటింగ్‌లో కెప్టెన్ మార్క్రమ్, డికాక్, రికల్టన్, బ్రెవిస్, మిల్లర్‌లో ఏ ఒక్కరు కుదురుకున్నా..టీమ్‌ఇండియా బౌలర్లకు అగ్నిపరీక్షే అవుతుంది. బౌలింగ్‌లో రబాడ, ఎంగ్డీ, మహారాజ్, బాశ్, యాన్సెన్ చెలరేగితే మన బ్యాటర్లకు ఇబ్బందులు తప్పకపోవచ్చు. పొట్టి ఫార్మాట్‌లో వరుసగా 12 విజయాలతో జోరుమీదున్న భారత్‌ను అడ్డుకోవాలంటే సఫారీలు శక్తికి మించి పోరాడాల్సిన పరిస్థితి. మొత్తంగా సూపర్-8లో మూడింటికి మూడు మ్యాచ్‌లు గెలిచి సెమీస్ బెర్తు ఖరారు చేసుకోవాలని ఇరు జట్లు కృత నిశ్చయంతో ఉన్నాయి. ఈనేపథ్యంలో ఇరు జట్ల మధ్య సండే బ్లాక్‌బస్టర్ అభిమానులను అలరించడం ఖాయంగా కనిపిస్తున్నది.

టాపార్డర్‌పై ఆందోళన:

మెగాటోర్నీలో టీమ్‌ఇండియా టాపార్డర్ బ్యాటింగ్ మేనేజ్‌మెంట్‌ను ఆందోళనకు గురిచేస్తున్నది. ప్రపంచకప్‌నకు ముందు సూపర్ ఫామ్‌తో విజృంభించిన అభిషేక్‌శర్మ హ్యాట్రిక్ డక్ ఔట్లతో ఘోరంగా నిరాశపరిచాడు. ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లోనే పరుగుల ఖాతా తెరువకుండానే ప్రత్యర్థికి వికెట్ సమర్పించుకుంటున్నాడు. సఫారీలతో సూపర్-8 పోరులోనైనా ఖాతా తెరుస్తాడా అన్నది ఆసక్తికరంగా మారింది. భారీ అంచనాలు పెట్టుకున్న హైదరాబాదీ తిలక్‌వర్మ స్థాయికి తగ్గ ప్రదర్శన కనబర్చలేకపోతున్నాడు.ఇప్పటి వరకు 120 స్ట్రైక్‌రేట్‌కు పరిమితమైన తిలక్ దూకుడుగా ఆడలేకపోతున్నాడు. కీలకమైన మూడో నంబర్‌లో వచ్చే తిలక్ భారీ షాట్లు ఆడటంలో విఫలమవుతున్నాడు. మరోవైపు ఇషాన్ కిషన్ 202 స్ట్రైక్‌రేట్‌తో ఆకాశమే హద్దుగా చెలరేగుతున్నాడు. మిడిలార్డర్‌లో శివమ్ దూబే టచ్‌లోకి రాగా, హార్దిక్‌పాండ్యా, రింకూసింగ్ బ్యాట్లు ఝులిపించాల్సి ఉంది.సుందర్ స్థానంలో అక్షర్‌పటేల్ రావడం ఖాయంగా కనిపిస్తుండగా, పిచ్‌ను దృష్టిలో పెట్టుకుని అర్ష్‌దీప్‌సింగ్ స్థానంలో కుల్దీప్‌యాదవ్‌ను తుది జట్టులోకి తీసుకునే చాన్స్ ఉంది. అంతకుమించి మార్పులేమి ఉండకపోవచ్చు.




# కివీస్, పాక్ పోరు వర్షార్పణం

**బంతి పడకుండానే సూపర్-8 పోరు రద్దు**
**ఇరు జట్లకు చెరో పాయింట్ కేటాయింపు**




పల్లెకిలె(శ్రీలంక): టీ20 ప్రపంచకప్‌లో సూపర్-8 దశకు ఆదిలోనే హంసపాదు! న్యూజిలాండ్, పాకిస్థాన్ మధ్య శనివారం జరుగాల్సిన సూపర్-8 తొలి పోరు వర్షార్పణమైంది. టాస్ గెలిచిన పాక్ బ్యాటింగ్ ఎంచుకోగా, అనుకోని అతిథిలా వరుణుడు రంగప్రవేశం చేశాడు. చిరుజల్లులతో మొదలై ఎంతకు తగ్గకపోవడంతో మైదానం మొత్తం నీటితో నిండిపోయింది. మధ్య మధ్యలో కొంత గెరువు ఇచ్చినా మైదానంపై కప్పిన కవర్లపై నీళ్లు భారీగా నిలిచి ఉండటంతో ఆట సాధ్యపడలేదు. మైదానాన్ని పలుమార్లు పరిశీలించిన అంపైర్లు ఆటకు ఏమాత్రం అనుకూలంగా లేకపోవడంతో రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో అప్పటి వరకు మ్యాచ్‌పై అభిమానులు పెట్టుకున్న ఆశలపై వరుణుడు నీళ్లు గుమ్మరించాడు. చేసేదేమి లేక ఫ్యాన్స్ నిరుత్సాహంగా స్టేడియాన్ని వీడారు. ఇరు జట్లకు చెరో పాయింట్ కేటాయించారు. పాక్‌తో పోరు కోసం కివీస్ మూడు మార్పులతో బరిలోకి దిగింది. రెగ్యులర్ కెప్టెన్ మిచెల్ సాంట్నర్ తిరిగి జట్టులోకి రాగా, పిచ్‌ను అంచనా వేస్తూ స్పిన్నర్ ఇష్ సోధీ, పేసర్ ఫెర్గుసన్‌ను ఎంపిక చేసుకుంది. మరోవైపు మెగాటోర్నీలో పడుతూలేస్తూ సాగుతున్న పాక్..ఖవాజ నఫయ్‌ను తప్పిస్తూ సీనియర్ ఫకర్ జమాన్‌ను తీసుకుంది. ఈనెల 24న ఇంగ్లండ్‌తో పాక్ తలపడనుంది. సెమీస్‌కు అర్హత సాధించాలంటే ప్రతీ మ్యాచ్ కీలకమైన నేపథ్యంలో పాయింట్లకు తోడు రన్‌రేట్ కీలకం కానుంది

# ఆస్ట్రేలియా గడ్డపై గర్జించిన భారత్.. మంధాన, శ్రేయాంక జోరుతో పొట్టి సిరీస్ కైవసం..!

ఆస్ట్రేలియాను వారి సొంతగడ్డపై ఓడించడం ఏ జట్టుకైనా సవాలే. ప్రపంచంలోనే మేటి జట్టైన ఆసీస్‌ను భారత మహిళల జట్టు చిత్తుగా ఓడించింది. అడిలైడ్‌లో 17 పరుగులతో గెలిచి పొట్టి సిరీస్ కైవసం చేసుకుంది. నిర్ణయాత్మక మ్యాచ్‌లో స్మృతి మంధాన(82), జెమీమా రోడ్రిగ్స్(59)ల విధ్వసంతో ఆసీస్‌కు సవాల్ విసిరిన టీమిండియాకు ఆతిథ్య జట్టు బదులివ్వలేకపోయింది. అష్లే గార్డ్‌నర్ (57) అర్ధ శతకంతో రాణించినా శ్రేయాంక పాటిల్(3-22) వికెట్ల వేటతో దెబ్బతీసింది. ఫలితంగా భారీ ఛేదనలో 159కే పరిమితమైన కంగారూ టీమ్ సిరీస్ కోల్పోయింది.వన్డే వరల్డ్‌కప్ ఛాంపియన్‌గా విదేశీ పర్యటనలో తొలి సీరస్ గెలుపొందింది భారత జట్టు. ఆస్ట్రేలియా పర్యటనను విజయంతో ఆరంభించిన భారత జట్టు టీ20 సిరీస్‌లో పంజా విసిరింది. తొలి పోరులోనే ఆసీస్‌కు షాకిచ్చిన టీమిండియా.. రెండో మ్యాచ్‌ను చేజేతులా వదిలేసింది. అయితే.. నిర్ణయాత్మక మూడో గేమ్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ సేన ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టింది. ఓపెనర్ స్మృతి మంధాన(82) అంతర్జాతీయ క్రికెట్‌లో 70వ అర్ధ శతకంతో.. జెమీమా రోడ్రిగ్స్(59) విధ్వంసంతో ఆతిథ్య జట్టు బౌలర్లు నీరుగారిపోయారు.భారీ ఛేదనలో ఆస్ట్రేలియాను శ్రేయాంక పాటిల్(ట3-22) ఆదిలోనే దెబ్బకొట్టింది. గత మ్యాచ్‌లో చెలరేగిన జార్జియా వోల్(10) ను తను ఔట్ చేయగా ఫొబే లిచ్‌ఫీల్డ్(26)ను శ్రీ చరణి వెనక్కి పంపింది. అష్లీ గార్డ్‌నర్(57) హాఫ్ సెంచరీతో పోరాడినా శ్రీచరణి(3-32), అరుంధతి రెడ్డి(2-35)లు వికెట్ల వేటతో ఒత్తిడి పెంచారు. ఆఖర్లో అనాబెల్ సథర్‌లాండ్(14)ను వెనక్కి పంపిన చరణి ఆసీస్ ఓటమిని పరిపూర్ణం చేసింది. ఆస్ట్రేలియా గడ్డపై భారత జట్టుకు ఇది రెండో టీ20 సిరీస్ విజయం. మెరుపు అర్ధ శతకంతో టీమిండియా గెలుపులో కీలకమైన మంధాన 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా ఎంపికైంది.

సెంచరీ భాగస్వామ్యంతో..

తొలుత కంగారూ బౌలర్లకు ఓపెనర్ స్మృతి మంధాన(82), జెమీమా రోడ్రిగ్స్(59) చుక్కలు చూపించారు. 19 పరుగులకే షఫాలీ వర్మ(7)ను ఔట్ చేసిన ఆసీస్ బౌలర్ల ఆనందాన్ని ఆవిరి చేస్తూ మంధాన, జెమీమా క్రీజులో పాతుకుపోయారు. మంధాన బౌండరీలతో చెలరేగగా.. జెమీమా క్లాస్ ఇన్నింగ్స్‌తో అలరించింగింది.



మన దునియా
Our News Our World
RNI Number TELTEL/2023/85680
మన అక్షరం - మన ప్రపంచం



# రష్మికతో వివాహం కానందుకు రక్షిత్ బాధపడటం లేదు: నటుడు ప్రమోద్

**గతంలో రక్షిత్ శెట్టితో రష్మిక నిశ్చితార్థం**

**వివాహం జరగకుండానే విడిపోయిన రక్షిత్, రష్మిక**

**రష్మిక-విజయ్ వివాహంపై స్పందించిన రక్షిత్ సన్నిహితుడు ప్రమోద్**

**మమ్మల్ని వివాహానికి పిలవదని తెలుసని వ్యాఖ్య**

రష్మిక తమను పెళ్లికి పిలవదని తమకు తెలుసని ప్రముఖ నటుడు ప్రమోద్ శెట్టి అన్నారు. రష్మికకు నటుడు రక్షిత్ శెట్టితో గతంలో నిశ్చితార్థం జరిగింది. అయితే వివాహం జరగకుండానే వీరిద్దరు విడిపోయారు. ఈ నేపథ్యంలో రక్షిత్ శెట్టి సన్నిహితుడు ప్రమోద్ రష్మిక, విజయ్ దేవరకొండ వివాహంపై స్పందించారు. తనకు ఆహ్వానం అందలేదని, అందితే వెళతానని చెప్పారు.అయితే వారి వివాహానికి తనను, రక్షిత్ శెట్టిని ఆహ్వానిస్తారని వేచి చూడటం లేదని తెలిపారు. రష్మికకు ఆహ్వానించే ఉద్దేశం లేదని ఆయన అభిప్రాయపడ్డారు. రక్షిత్ శెట్టి ప్రస్తుతం సినిమా పనుల్లో బిజీగా ఉన్నారని వెల్లడించాడు. రష్మికతో వివాహం జరగనందుకు రక్షిత్ బాధపడటం లేదని పేర్కొన్నారు. చాక్లెట్ తింటూ అదే విషయం గురించి ఆలోచించడానికి అతనేం పిల్లవాడు కాదన్నారు. ఈ విషయం ఆయన సన్నిహితులందరికీ తెలుసని చెప్పారు. ఈ నెల 26న విజయ్ దేవరకొండ, రష్మికల వివాహం రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్ ప్యాలెస్ వేదికగా జరగనున్నట్టు తెలుస్తోంది.

# తల్లి పాత్రతో వెబ్ సిరీస్ లోకి మీనా



వెండితెరపై దశాబ్దాల పాటు తనదైన ముద్ర వేసిన నటి మీనా, ఇప్పుడు డిజిటల్ దునియాలోకి అడుగుపెడుతున్నారు. ఆమె నటించిన సరికొత్త వెబ్ సిరీస్ 'రోస్లిన్' ఈ నెల 27 నుంచి జియో హాట్‌స్టార్ లో ప్రసారం కానుంది. ఈ సందర్భంగా ఆమె తన సినీ ప్రయాణంలోని ఒడిదుడుకులు, వ్యక్తిగత అనుభవాలను ఓ ఇంటర్వ్యూలో పంచుకున్నారు.

షూటింగ్ సెట్టే 'పండగ'.. అమ్మ నేర్పిన పాఠం కెరీర్ పీక్ స్టేజ్‌లో ఉన్నప్పుడు పండగలు, పబ్బాలు కూడా జరుపుకోలేనంత బిజీగా ఉండేవారట మీనా. "అందరూ ఇంట్లో టపాసులు కాలుస్తుంటే, నేను మాత్రం మేకప్ తో సెట్ లో ఉండేదాన్ని. నాకిష్టమైన పండగలను మిస్ అవుతున్నానని చాలా బాధపడ్డా" అని ఆనాటి రోజులను మీనా గుర్తుచేసుకున్నారు. అయితే, ఆమె తల్లి చెప్పిన ఒకే ఒక్క మాట మీనా ఆలోచనను మార్చేసింది. "పండగ ఎవరైనా చేసుకుంటారు.. కానీ వందల మంది కొత్త వ్యక్తుల మధ్య, కొత్త ప్రదేశాల్లో పని చేసే అవకాశం మాత్రం అందరికీ రాదు" అని అమ్మ చెప్పిందన్నారు. అప్పటి నుంచి పనిలోనే పండగను వెతుక్కోవడం నేర్చుకున్నానని మీనా తెలిపారు.

నేటి పిల్లలకు అన్నీ తెలుసు..

ఇప్పటి తరం పిల్లల గురించి మీనా ప్రాక్టికల్‌గా స్పందించారు. "ఈ జనరేషన్ పిల్లలకు మనం ఏది చెప్పినా 'మాకు తెలుసులే' అనేస్తారు. వారికి అన్ని విషయాలపై విపరీతమైన అవగాహన ఉంది. పిల్లలకు ఏది మంచి, ఏది చెడు అని వివరించడం వరకే తల్లిదండ్రులుగా మన బాధ్యత అని, అంతకుమించి వారిని నియంత్రించడం కష్టం" అని ఆమె అభిప్రాయపడ్డారు.



# గర్భవతిగానే సినిమా చేశా: లావణ్య త్రిపాఠి

**మార్చి 6న విడుదలవుతున్న 'సతీ లీలావతి'**

**ఈ సినిమాలో ప్రధాన పాత్ర పోషించిన లావణ్య త్రిపాఠి**

**సినిమా మొదలైన తర్వాత తనకు ప్రెగ్నెన్సీ అని తెలిసిందని వెల్లడి**

మెగా కోడలు లావణ్య త్రిపాఠి పెళ్లి తర్వాత కూడా సినిమాల్లో యాక్టివ్‌గా కొనసాగుతోంది. ఇటీవలే ఆమె పండంటి బాబుకు జన్మనిచ్చిన సంగతి తెలిసిందే. మరోవైపు, ఆమె ప్రధాన పాత్ర పోషించిన 'సతీ లీలావతి' మార్చి 6న విడుదలకు సిద్ధమవుతోంది. ప్రస్తుతం ఈ సినిమా ప్రమోషన్ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఈ ప్రమోషన్స్‌లో భాగంగా యాంకర్ సుమ కనకాలకు ఇచ్చిన ఇంటర్వ్యూలో లావణ్య తన ప్రెగ్నెన్సీ సమయంలో ఎదుర్కొన్న అనుభవాలను పంచుకుంది. "ఈ సినిమా పనులు మొదలైన తర్వాత నాకు ప్రెగ్నెన్సీ అని తెలిసింది. సినిమాకు 'నో' చెబితే నిర్మాతలకు నష్టం అవుతుందని భావించాను. అందుకే గర్భవతిగానే షూటింగ్ చేశాను. వాంతులు అయ్యాక కూడా సెట్‌కి వెళ్లేదాన్ని. మైగ్రేన్ వచ్చినప్పుడు టాబ్లెట్స్ వేసుకుని షూట్ చేసేదాన్ని" అని లావణ్య వెల్లడించింది. యాక్షన్ సన్నివేశాలు చేయాల్సి వచ్చినప్పుడు ఎంతో భయం వేసేదని, ప్రతి షెడ్యూల్ ముగిసిన తర్వాత ఆసుపత్రికి వెళ్లి చెకప్ చేయించుకునేదాన్నని చెప్పింది. మూడు నెలల్లోపే షూటింగ్ పూర్తి చేసేలా ప్లాన్ చేశారని తెలిపింది. డ్యాన్స్ సీక్వెన్స్ సమయంలో కూడా భయం వేసిందని, కొరియోగ్రాఫర్ బృందా మాస్టర్ తన పరిస్థితిని అర్థం చేసుకుని స్టెప్స్ సర్దుబాటు చేశారని చెప్పింది. బేబీ బంప్ కనిపించకుండా కాస్ట్యూమ్స్ లూజ్‌గా డిజైన్ చేయించారని వెల్లడించింది. నాలుగో నెలలో కొన్ని సన్నివేశాలు ప్యాచ్‌వర్క్ చేయాల్సి వచ్చిందని తెలిపింది. ఇంట్లోవాళ్లు మొదట భయపడినా, చివరికి పూర్తి సపోర్ట్ ఇచ్చారని, ముఖ్యంగా భర్త వరుణ్ చాలా అండగా నిలిచారని లావణ్య చెప్పింది. డాక్టర్లు ఎక్కువ ప్రయాణాలు చేయొద్దని చెప్పారని... అయితే, షూటింగ్ రామోజీ ఫిల్మ్ సిటీలో జరిగేది కాబట్టి పొద్దున్నే లేచి వెళ్లడం కష్టంగా అనిపించేదని తెలిపారు. "ప్రెగ్నెన్సీ విషయం షూటింగ్ టీమ్‌కు మొదట్లో తెలియదు. తెలిస్తే ప్రత్యేకంగా చూస్తారేమోనని భయంతో చెప్పలేదు" అని ఆమె వెల్లడించింది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AAKULA SUDHAKAR, PUSHPALATHA PUBLICATIONS AND PRINTING, HNo: 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLA-BELLY MANDALAM, WARANGAL DIST - 506349, TELANGANA STATE, PUBLISHED PUSHPALATHA PUBLICATIONS HNo. 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLABELLY MANDALAM, WARANGAL DIST- 506349.TELANGANA STATE,TITEL-code : RNI NUMBER ; TELTEL-2O23/85680, Cel1 No: 9603969335, MANADUNIA 2022 @ gmail.com